


# ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 29-05-2026 | సంపుటి - 28 | సంచిక -03 | రూ : 4 | పేజీలు : 8


## రాయదుర్గంలో ఎకరా రూ.237 కోట్లు

- టీజీఐఐసీ ఈవేలంలో చరిత్ర తిరగరాసిన హైదరాబాద్ రియాల్టీ
- 6.29 ఎకరాల ప్లాట్ ఏకంగా రూ.1,490.73 కోట్లకు విక్రయం

2లో




## కుల, మత, ప్రాంతాలకు అతీతమైన నాయకుడు 'ఎన్టీఆర్'



- నీతి, నిజాయతీ, ఉక్కు సంకల్పం ఆ మహనీయుడి సొంతం
- ఇందిరమ్మ, రామారావు స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రజాపాలన
- ఆయన విగ్రహావిష్కరణ జీవితాంతం గుర్తుండిపోయే జ్ఞాపకం
- 2034 వరకు ప్రజాప్రభుత్వానిదే అధికారం
- అమీర్‌పేట మైత్రీవనం చౌరస్తాలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి

2లో



## నేడు.. రేపు వడగాలులు



- పలు జిల్లాలకు వర్ష సూచన
- 12 జిల్లాల్లో 46 డిగ్రీలపైన ఉష్ణోగ్రతలు నమోదు

2లో

## చరిత్ర ఉన్నంత వరకు తెలుగువారి గుండెల్లో ఎన్టీఆర్

- సినీ, రాజకీయ చరిత్రలో ఆయన మార్గం అనితరసాధ్యం
- అన్నగారి ఆశయాలు కొనసాగిస్తున్నాం
- మహానాడులో తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు ఘన నివాళి
- ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని ఏకగ్రీవ తీర్మానం

2లో





## జల వివాదాల పరిష్కారానికి సహకరించుకోండి

- కెన్-బెట్వాను ఆదర్శంగా తీసుకోండి
- రాష్ట్రాలకు ప్రధాని మోదీ సూచన

2లో

## ఎమ్మెస్పీలో.. రాష్ట్రాలకు భాగస్వామ్యం

- నిల్వ, శుద్ధి, మార్కెట్ మౌలిక సదుపాయాలు పెరగాలి
- పంటల మార్పిడిని ప్రోత్సహించాలి
- కేంద్ర ప్రభుత్వానికి అగ్రి వర్సిటీ నివేదిక

2లో




## డిజిటల్ పవర్‌హౌస్‌గా తెలంగాణ



- ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సెంటర్లలో దేశంలోనే అగ్రగామి
- అసోచామ్-పీడబ్ల్యూసీ నివేదికలో వెల్లడి

2లో




# కుల, మత, ప్రాంతాలకు అతీతమైన నాయకుడు 'ఎన్టీఆర్'

హైదరాబాద్, అమీర్‌పేట్: కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా జాతి గర్వించదగ్గ నాయకుడు నందమూరి తారక రామారావు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. ఒక సీఎంగా ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించడం జీవితకాలం గుర్తుండిపోయే జ్ఞాపకమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయంలో ఇందిరమ్మ, ఎన్టీఆర్ స్ఫూర్తి కనిపిస్తుందన్నారు. హైదరాబాద్‌లోని అమీర్‌పేట మైత్రీవనం చౌరస్తాలో మహానటుడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా చేపట్టిన విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. తొలుత పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ కుమారులు రామకృష్ణ, మోహనకృష్ణ ఇతర కుటుంబ సభ్యులతో కలిసి విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. ''తెలుగుజాతి అభిమానంతో అన్నా అని పిలుచుకునే ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం ఎంతో సంతోషం. దేశచరిత్ర నుంచి ఎవరు స్ఫూర్తి పొందాలన్నా ముగ్గురు జాతిరత్నాలను తలచుకోవాలి. భారత రాజ్యాంగాన్ని రచించి పేదలకు మేలు చేసిన డాక్టర్ అంబేద్కర్‌ను మొదట స్మరించుకోవాలి. 1971లో పాకిస్థాన్ భారత్ యుద్ధంలో తెగువ చూపి.. పాక్ నుంచి బంగ్లాదేశ్‌ను విడదీసి.. అమెరికాను కల్పించుకోవద్దని హెచ్చరిక జారీ చేసిన ఉక్కు మహిళ.. భూసంస్కరణలు తెచ్చి.. పేదలకు పంచి హక్కులు కల్పించిన మహానేత ఇందిరాగాంధీని తలచుకోవాలి. మూడోతరంలో నీతి, నిజాయతీ, ఉక్కు సంకల్పం కలిగిన నాయకుడు ఎన్టీఆర్‌ను స్మరించుకోవాలి. ఎన్టీఆర్ విగ్రహాన్ని కాంగ్రెస్ ముఖ్యమంత్రి ఆవిష్కరించడం ఏమిటని కొందరు విమర్శలు చేస్తున్నారు.. వారికిదే సమాధానం. ఆయన కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా జాతి గర్వించదగ్గ నాయకుడు. ఇది కేవలం విగ్రహం మాత్రమే కాదు.. రాజకీయాలకు అతీతమైన స్ఫూర్తి. బలహీనవర్గాల నాయకులు పాలకులుగా ఎదగడం వెనుక ఆయన సహకారం ఎంతో ఉంది. తెలంగాణకు తుమ్మల, మండవ, కడియం, మోత్కుపల్లి, జానారెడ్డిలాంటి ఎంతోమంది నాయకులను అందించారు. భారాస అధినేత కేసీఆర్‌ను గుర్తించి నాయకుడిని చేసింది, రాజకీయ భిక్ష పెట్టింది ఎన్టీఆర్ కాదా? ఎన్టీఆర్ పేరు పెట్టుకున్న వాళ్లు కూడా ఆయన విగ్రహం పెట్టడాన్ని విమర్శిస్తున్నారు.

*** సన్నబియ్యం అందించడం వెనుక ఎన్టీఆర్ స్ఫూర్తి..**

రాష్ట్రవ్యాప్తంగా పేదలు, బలహీనవర్గాలకు సన్నబియ్యం అందిస్తున్న స్ఫూర్తి వెనుక ఎన్టీఆర్ అందించిన రూ.2 కిలో బియ్యం పథకం ఉంది. ఆడబిడ్డలకు సంక్షేమ పథకాలు అందించిన, పటేల్ పట్వారీ వ్యవస్థను రద్దు చేసి పేదలు ఆత్మగౌరవంతో బతికే అవకాశం కల్పించిన ఘనత ఆయనకు దక్కుతుంది. నాడు రాజీవ్‌గాంధీ స్థానిక సంస్థల్లో ఆడబిడ్డలకు రిజర్వేషన్ కల్పిస్తే.. అమలు చేసిన ఘనత ఎన్టీఆర్‌ది. ఆయన ఆశయాలకు అనుగుణంగా నిరుపేదలకు టికెట్లు ఇచ్చి గెలిపించుకున్నాం. మా ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిఏడాదిలోనే 65 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. భవిష్యత్తులోనూ మీ సహకారం ఇలాగే కొనసాగితే 2034 వరకు ప్రజాప్రభుత్వానిదే అధికారం. సైబరాబాద్‌ను చంద్రబాబు ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళితే.. ఇప్పుడు 50,000 ఎకరాల్లో నిర్మించనున్న భారత్ ఫ్యూచర్ సిటీకి ప్రపంచ దిగ్గజ కంపెనీలను తీసుకొస్తాం. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం'' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**మాట ఇచ్చాం.. నిలబెట్టుకున్నాం**

పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మాటకు కట్టుబడి ఉంటుందని చెప్పడానికి ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ ఒక తార్కాణమని పేర్కొన్నారు. ఆయన మాదిరిగానే సీఎం రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతిగా పాలన సాగిస్తున్నారన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఇందిరమ్మ, ఎన్టీఆర్ స్ఫూర్తితో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన అందిస్తున్నారన్నారు. మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించారన్నారు. జూబ్లీహిల్స్ శాసనసభ్యుడు నవీన్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్, వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గాంధీ, జైవీర్, కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ బండి రమేశ్, వైస్ ఛైర్మన్ పరుచూరి మురళీకృష్ణ, నటుడు మంచు మనోజ్, సినీ దర్శకుడు బోయపాటి శ్రీను పాల్గొన్నారు. జీవనశక్తి చిట్‌ఫండ్స్ అధినేత కాట్రగడ్డ రమేశ్ ఎన్టీఆర్ విగ్రహాన్ని అందించగా.. కమ్మ సంఘం నేతలు కాసరనేని కిశోర్, కొల్లి లక్ష్మణరావు, వేములపల్లి విజయకుమార్, మన్నె లక్ష్మణ్‌బాబు, బలుసు వినయ్, చలసాని అరుణ్ ప్రసాద్, అమీర్‌పేట్ కమ్మ సంఘం అధ్యక్షుడు సీవీరావు తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## నేడు.. రేపు వడగాలులు

హైదరాబాద్: రాష్ట్రంలో శుక్ర, శనివారాల్లో పలు జిల్లాల్లో వడగాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. శుక్రవారం ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో.. శనివారం వీటితోపాటు నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లోనూ వడగాలులు నమోదవుతాయని పేర్కొంది. శుక్ర, శనివారాల్లో ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో (గంటకు 4050 కి.మీ.) కూడిన వర్షాలు కురుస్తాయని సూచించింది. వచ్చే నెల మూడో తేదీ వరకు పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు తెలిపింది. మరోవైపు నైరుతి రుతుపవనాల్లో కొద్దిగా కదలికలు ప్రారంభమయ్యాయి. బంగాళాఖాతంలో ఎగువకు రుతుపవనాలు కదిలేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు ఐఎండీ ఓ ప్రకటనలో తెలిపింది. గురువారం రాష్ట్రంలో ఎండలు దంచికొట్టాయి. బుధవారం వాతావరణం కాస్త చల్లగా అనిపించినా.. తెల్లారేసరికి అంతా మారిపోయింది. 12 జిల్లాల్లో 46 డిగ్రీలు.. ఆపైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలో 46.4 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. పెద్దపల్లి జిల్లా ముత్తారం 46.3, వరంగల్ జిల్లా సంగెం 46.3, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం 46.2, ఖమ్మం జిల్లా ఏన్కూరు 46.2, కుమురం భీం జిల్లా బెజ్జూరు 46.2, నిజామాబాద్ జిల్లా బోధన్ 46.2, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ 46.1, జగిత్యాల జిల్లా యెండపల్లి 46.1, మహబూబాబాద్ జిల్లా గార్ల 46.1, సూర్యాపేట జిల్లా నాగారం 46.1, నిర్మల్ జిల్లా కేంద్రంలో (నిర్మల్ గ్రామీణ మండలం) 46 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## రాయదుర్గంలో ఎకరా రూ.237 కోట్లు

హైదరాబాద్: మహా నగరంలో భూమి బంగారమైంది. నాలుగేళ్ల కిందట హైదరాబాద్‌లో ఎకరం భూమి రూ.100 కోట్లు అంటే.. దేశమే ఆశ్చర్యపోయింది. గతేడాది ఎకరా రూ.177 కోట్లతో రికార్డులను బద్దలుకొట్టింది. ఇప్పుడు ఏకంగా చుక్కలను తాకేలా రూ.200 కోట్ల మార్కును దాటి ఆల్‌టైమ్ రికార్డు ధర పలికింది. హైదరాబాద్‌లోని రాయదుర్గంలో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) గురువారం నిర్వహించిన ఈవేలంలో మునుపెన్నడూ లేనివిధంగా ఎకరా భూమి ఏకంగా రూ.237 కోట్లు పలికి పాత రికార్డులన్నింటినీ తిరగరాసింది.

**పోటీ పడిన సంస్థలు**

రాయదుర్గం గ్రోత్ కారిడార్‌లోని అత్యంత కీలకమైన 83/1 సర్వే నంబరులోని ప్లాట్ నంబరు 1ఏ, 1/ఎఫ్ పరిధిలోని 6.29 ఎకరాల మల్టీయూజ్ (బహుళ వినియోగం) భూమికి టీజీఐఐసీ గురువారం ఈవేలం నిర్వహించింది. ఎకరాకు రూ.139 కోట్ల రిజర్వు ధరను నిర్ణయించగా.. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ డెవలపర్లు, కార్పొరేట్ సంస్థలు భూమిని దక్కించుకోవడానికి పోటీపడ్డాయి. 'ఎంఎస్‌టీసీ' పోర్టల్ ద్వారా పారదర్శకంగా సాగిన ఈ డిజిటల్ వేలంలో ఊహించని రీతిలో బిడ్లు దాఖలయ్యాయి. చివరకు రిజర్వు ధర కంటే రికార్డు స్థాయిలో ఎక్కువ పలికి, మొత్తం రూ.1,490.73 కోట్ల భారీ ధరతో ఈ ప్లాట్ అమ్ముడుపోయింది. హైదరాబాద్‌కి చెందిన గౌర వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ స్థిరాస్తి సంస్థ ఈ భూమిని దక్కించుకుంది. జేఎల్ఎల్ సంస్థ ఈ లావాదేవీకి ప్రత్యేక సలహాదారుగా వ్యవహరించింది. సరికొత్త మౌలిక వసతులు, అప్రతిహతంగా సాగుతున్న ఐటీ, వాణిజ్యరంగాల విస్తరణతో హైదరాబాద్.. అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని ఈ 'ల్యాండ్ మార్క్' వేలం మరోసారి స్పష్టం చేసింది. ఇదే సర్వే నంబరు ప్లాట్ నంబరు పీ4లో 5.09 ఎకరాలకు జూన్ ఒకటిన వేలం జరగనుంది.

**ఏటికేడు ఆకాశమే హద్దు!**

హైటెక్ సిటీ, గచ్చిబౌలి ప్రాంతాల మధ్య ఉండటంతో ఈ భూమికి మార్కెట్లో ఊహించని రీతిలో డిమాండ్ ఏర్పడింది. 2017లో రాయదుర్గం ప్రాంతంలో 2.84 ఎకరాల భూమికి ఎకరాకు రూ.42.59 కోట్లు పలికింది. 2022 నాటికి కోకాపేట నియోపొలిస్ వేలంలో 3.60 ఎకరాల పరిధిలో ఎకరా ధర రూ.100.75 కోట్లకు చేరి అప్పట్లో రికార్డును సృష్టించింది. 2025 అక్టోబరులో రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో జరిగిన వేలంలో ఎకరా ధర రూ.177 కోట్లు పలికింది. ఇప్పుడు ఆ రికార్డులన్నీ కనుమరుగయ్యేలా రాయదుర్గంలోని పాన్‌మక్తాలో జరిగిన తాజా వేలంలో ఎకరా ధర అసాధారణ రీతిలో రూ.237 కోట్లు పలికి సరికొత్త చరిత్ర లిఖించింది. రికార్డు ధరకు ప్లాట్ అమ్ముడవడంపై టీజీఐఐసీ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.శశాంక స్పందిస్తూ.. 'రాయదుర్గం ఈవేలానికి వచ్చిన స్పందన అసాధారణం. హైదరాబాద్‌తో పాటు తెలంగాణపై పెట్టుబడిదారులకు, డెవలపర్లకు ఉన్న నమ్మకానికి ఇది నిదర్శనం' అని పేర్కొన్నారు.

## డిజిటల్ పవర్‌హౌస్‌గా తెలంగాణ

హైదరాబాద్: దేశాన్ని ట్రిలియన్ డాలర్ల డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా ముందుకు నడిపించడంలో తెలంగాణ డిజిటల్ పవర్‌హౌస్‌గా మారిందని అసోచామ్‌పీడబ్ల్యూసీ నివేదిక తెలిపింది. ఏఐ, క్లౌడ్‌కంప్యూటింగ్, హైపర్‌స్కేల్ డేటా సెంటర్ మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్రం గణనీయంగా ముందుకు వెళ్తోందని పేర్కొంది. హైదరాబాద్ ఒక టెక్ మెట్రోపాలిస్‌గా మారిందని.. హైటెక్‌సిటీ, మాదాపూర్, గచ్చిబౌలి, నానక్‌రామ్‌గూడ ప్రాంతాలు అగ్రశ్రేణి ప్రతిభను ఆకర్షించే ప్రపంచస్థాయి వసతులతో కూడిన క్యాంపస్‌లుగా మారాయని తెలిపింది. ప్రభుత్వం తీసుకుంటున్న విధానపరమైన నిర్ణయాలతో భారీగా పెట్టుబడులు వస్తున్నాయని వివరించింది. తెలంగాణ డేటాసెంటర్లు, ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ రంగాలు దేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు దోహదం చేస్తున్న విధానంపై అసోచామ్, పీడబ్ల్యూసీ సంయుక్తంగా గురువారం నివేదిక విడుదల చేశాయి. ప్రత్యేక ఏఐ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసి పరిశ్రమలతో ఒప్పందం చేసుకోవాలని, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలని ఈ నివేదిక సూచించింది.

**ముఖ్యాంశాలు, సూచనలు**

- * ఐటీ కారిడార్‌లో పెద్దఎత్తున డేటా సెంటర్లతో పురపాలక ఆదాయం 15% పెరిగింది. విదేశీ పెట్టుబడులు ఆర్థిక స్థిరత్వాన్ని పెంచాయి. భూమి కేటాయింపులు, సబ్సిడీల కన్నా వీటి ఏర్పాటుతో దీర్ఘకాలిక ఆర్థిక లాభాలు ఎక్కువ.
- * తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాలతో హైదరాబాద్ దేశంలోనే అత్యంత ముఖ్యమైన ఐటీ హబ్‌లలో ఒకటిగా నిలిచింది. పరిశ్రమలకు 24 గంటల నిరంతర విద్యుత్తు సానుకూలాంశం.
- * రాష్ట్రం అగ్రశ్రేణి విద్యాసంస్థల కేంద్రంగా ఉంది. యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ, ఏఐకేఏఎం, గ్లోబల్ ఏఐ ఇన్నోవేషన్ హబ్ సంస్థలు ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా ఇంజినీరింగ్, భవిష్యత్తు సాంకేతికలకు అనుగుణంగా నిపుణులను తీర్చిదిద్దుతున్నాయి.
- * వరంగల్, నిజామాబాద్, కరీంనగర్ వంటి ద్వితీయ, తృతీయశ్రేణి నగరాలకు ఐటీ విప్లవాన్ని విస్తరించడంతో రాజధాని వెలుపలా ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయి.
- * 202324తో పోలిస్తే ఐటీ ఎగుమతులు 16.6% వృద్ధితో 202425 నాటికి రూ.3.13 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఐటీ ఉద్యోగుల సంఖ్య 9.39 లక్షలకు చేరింది. హైదరాబాద్ 1,500 కన్నా ఎక్కువ ఐటీ, ఐటీఈఎస్ కంపెనీలకు కేంద్రంగా ఉంది.

దేశవ్యాప్తంగా జీసీసీల్లో 20 శాతానికి పైగా ఇక్కడే ఉన్నాయి. రెండేళ్లలో తెలంగాణ వివిధ రంగాల్లో పెట్టుబడులను, ప్రధాన జీసీసీలను ఆకర్షించింది. గత ఏడాది అక్టోబరు నాటికి కొత్తగా 40 జీసీసీలు హైదరాబాద్‌కి వచ్చాయి. ఇది దేశంలోనే అత్యధికం.

## చరిత్ర ఉన్నంత వరకు తెలుగువారి గుండెల్లో ఎన్టీఆర్

అమరావతి: చరిత్ర ఉన్నంత వరకు తెలుగువారి గుండెల్లో నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) శాశ్వతంగా నిలిచిపోతారని తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఆయన జయంతి తెలుగు జాతికి పండుగ రోజు అని వెల్లడించారు. గురువారం ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని మహానాడులో ఆయన విగ్రహానికి చంద్రబాబు ఘననివాళులర్పించారు. అనంతరం 'ఎన్టీఆర్‌కు నివాళి'లో మాట్లాడారు. 'సబ్‌రిజిస్ట్రార్ ఉద్యోగాన్ని వదిలి సినిమాల్లోకి వెళ్లడం.. సినీ చరిత్రలో అత్యున్నత స్థాయికి ఎదగడం, ప్రజల కోసం పార్టీ పెట్టి 9 నెలల్లోనే సీఎం కావడం ఇవన్నీ ఎన్టీఆర్‌కు మాత్రమే సాధ్యమయ్యాయి. స్వీయ క్రమశిక్షణ, నీతి, నిజాయతీ, పట్టుదల ఎన్టీఆర్ విధానం. పాలు అమ్ముతూ చదువుకున్నా.. ప్రభుత్వ ఉద్యోగం చేసినా.. సినిమాల్లో నటించినా.. రాజకీయాల్లోకి వచ్చినా ఆత్మగౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని వీడలేదు. 45 ఏళ్లు వెండితెరపై ఏ పాత్ర పోషించినా తిరుగులేదనిపించుకున్నారు. అలాంటి పాత్రలు వేయాలంటే మళ్లీ ఎన్టీఆరే పుట్టాలి తప్ప వేరే వాళ్లకు సాధ్యం కాదు. మనకు ఐదేళ్లు అవకాశమిచ్చి ఏం చేశారని అడిగితే తడుముకుంటాం. 13 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్టీఆర్ చరిత్ర సృష్టించారు. ఆయన పేరు తలుచుకుంటే నరనరాల్లో ఉత్తేజం, ఆత్మవిశ్వాసం, పట్టుదల వస్తాయి' అని పేర్కొన్నారు.

*** అంతటి ఆకర్షణీయమైన నేత ఇప్పటికీ లేరు**

'దేశ రాజకీయాల్లో ఎన్టీఆర్ అంత ఆకర్షణ కలిగిన నాయకుడు ఇప్పటికీ లేరు. అవినీతి రాజకీయాలను కడిగిపారేయాలన్న పట్టుదల ఆయన్ను రాజకీయాల్లోకి తీసుకొచ్చింది. ప్రాంతీయ పార్టీ అయిన తెదేపా జాతీయ రాజకీయాల్లోనూ కీలకపాత్ర పోషించింది. ప్రధాన ప్రతిపక్షంగా వ్యవహరించింది. కేంద్రంలో ప్రభుత్వాల ఏర్పాటుకు దోహదం చేసింది. ఎన్టీఆర్ అంటే పేదవాడికి భరోసా.. రైతుకు నేస్తం.. బడుగుబలహీన వర్గాలకు ధైర్యం.. యువతకు భవిష్యత్తు.. మహిళలకు అండ.. కార్మికులకు అభయం. అన్ని వర్గాలూ కీర్తించే ఏకైక నాయకుడు ఎన్టీఆర్. సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు అన్న ఆయన సిద్ధాంతమే మనకు ఎప్పటికీ ఆదర్శం. పార్టీ పసుపు జెండా అంటే తెలుగువారి ఆత్మగౌరవం. ఈ పవిత్రమైన రోజున ఆయన ఆశయాలకు అంకితమై ఆయన సిద్ధాంతాలను భావితరాలకు అందించాలి' అని చెప్పారు.

## జల వివాదాల పరిష్కారానికి సహకరించుకోండి

దిల్లీ: అంతర్రాష్ట్ర జల వివాదాలను పరస్పర సహకారం ద్వారా రాష్ట్రాలు పరిష్కరించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. ప్రాజెక్టులకు సకాలంలో అనుమతులు ఇవ్వడం, సాంకేతికత ఆధారంగా పర్యవేక్షించడం మేలని చెప్పారు. కెన్‌బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టును ఈ విషయాల్లో ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బుధవారం రాత్రి దిల్లీలో జరిగిన 'ప్రో యాక్టివ్ గవర్నెన్స్ అండ్ టైమ్‌లీ ఇంప్లిమెంటేషన్' (ప్రగతి) 51వ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. రైల్వే, విద్యుచ్ఛక్తి, రహదారుల రంగాలకు సంబంధించి తొమ్మిది రాష్ట్రాల్లో సుమారు రూ.30,000 కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేయకపోవడం వల్ల ఖర్చు పెరగడమే కాకుండా ఆయా సదుపాయాలను ప్రజలు ఉపయోగించుకునే వీల్లేకుండా పోతుందని గుర్తుచేశారు. ఓడరేవులు, స్వచ్ఛభారత్ మిషన్ 2.0 వంటి ఇతర పథకాలపైనా సమీక్షించినట్లు గురువారం 'ఎక్స్' వేదికగా తెలిపారు. నదుల అనుసంధానం, జల సంరక్షణ, భూగర్భ జలాలను రీఛార్జి చేయడం, సమర్థ సాగునీటి వినియోగం వంటి రంగాల్లో కెన్‌బెట్వా తరహా అవకాశాలను రాష్ట్రాలు గుర్తించాలని ప్రధాని సూచించారు.

**సౌర విద్యుత్తుకు ప్రాధాన్యం**

''ఇళ్ల పైకప్పులపై సౌర విద్యుత్తు వ్యవస్థల ఏర్పాటును నగరాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రోత్సహించాలి. ముఖ్యంగా నివాస సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాలపై దృష్టిపెట్టాలి. విద్యుత్తుపై వ్యయాన్ని తగ్గించి, ఇంధన భద్రత పెంచేందుకు, శుద్ధ ఇంధనాన్ని సామాజిక స్థాయిలో ప్రోత్సహించేందుకు ఇది అవసరం.

## తాత్కాలిక ఒప్పందం?

దుబాయ్: అమెరికా, ఇరాన్ మధ్య తాత్కాలిక ఒప్పందం కొలిక్కి వచ్చింది. 60 రోజులపాటు కాల్పుల విరమణ పాటించేలా.. ఇరాన్ అణు కార్యక్రమంపై చర్చలు జరిపేలా, హర్మూజ్‌ను తెరిచేలా ఒప్పందం కుదుర్చుకోవడానికి గురువారం ఇరు వర్గాలు అంగీకరించాయి. ఈ ఒప్పందంపై అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేస్తే వెంటనే అమల్లోకి వచ్చే అవకాశముందని అమెరికా అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే అమెరికాతో ఒప్పందాన్ని ఇంతవరకూ ఇరాన్ ధ్రువీకరించలేదు. ఇక ఒప్పందంపై అంగీకారానికి రావడానికి ముందు రెండు వర్గాలు భీకర దాడులు చేసుకున్నాయి. సోమవారంనాడు ఇరాన్‌పై విరుచుకుపడ్డ అమెరికా.. బుధవారం మళ్లీ దాడులు చేసింది. డ్రోన్‌ను ప్రయోగించేందుకు సిద్ధంగా ఉన్న బందర్ అబ్బాస్‌లోని సైనిక స్థావరంపై దాడులు చేశామని వెల్లడించింది. తమపై దాడికి పాల్పడిన వైమానిక స్థావరంపై ప్రతి దాడి చేసినట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రధాన కార్యాలయం, వైమానిక, నౌకా స్థావరాలపై దాడులు జరిగినట్లు తెలుస్తోంది. ఈ దాడులను అమెరికా తీవ్రంగా తప్పుబట్టింది. తమపై దాడులకు ప్రతీకారంగా గల్ఫ్‌లోని అమెరికా కీలక స్థావరంపై ఈ దాడులు చేసినట్లు ఇరాన్ వెల్లడించింది.

**ఒప్పందానికి సిద్ధం: ట్రంప్**

ఇరాన్‌తో చర్చలు జరుగుతున్నాయని, ఈ వారాంతంలోగా ఒప్పందం కుదురుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. బుధవారం క్యాబినెట్ సమావేశం ప్రారంభంలో ఆయన ఈ ప్రకటన చేశారు. హర్మూజ్‌లో నౌకా రవాణాను నియంత్రిస్తున్న ఇరాన్ సంస్థ పర్షియన్ గల్ఫ్ స్ట్రెయిట్ అథారిటీపై బుధవారం అమెరికా అదనపు ఆంక్షలు విధించింది. ప్రస్తుతం ఈ సంస్థే ఒక్కో నౌక నుంచి 2 మిలియన్ డాలర్ల టోల్ వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తమ దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి, ఆర్థికంగా బలహీనపరచడానికి, రాజకీయంగా ముట్టడించడానికి, తమ సైన్యం మోకరిల్లడానికి యుద్ధం తర్వాత ఇజ్రాయెల్, అమెరికా ప్రణాళిక రచించాయని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ స్పష్టం చేశారు.

### ఎమ్మెస్పీలో
## రాష్ట్రాలకు భాగస్వామ్యం

హైదరాబాద్: దేశంలో పంట ఉత్పత్తులకు మద్దతు ధరల విధానంలో సంస్కరణలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. 'మిగులు నిల్వల నిర్వహణ, వాతావరణ మార్పులు, నీటి కొరత, మారుతున్న మార్కెట్ అవకాశాల వంటి వాస్తవిక పరిస్థితులను ఎదుర్కొనేలా రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి వ్యవసాయ మద్దతు విధానాలను పునర్వ్యవస్థీకరించాలి' అని పేర్కొంది. దేశవ్యాప్తంగా అమలవుతున్న మద్దతు ధరల విధానంపై భిన్నాభిప్రాయాలు, చట్టబద్ధత డిమాండ్ నేపథ్యంలో కేంద్రం అభిప్రాయాలను సేకరిస్తోంది. దీనికి అనుగుణంగా ఐకార్ సూచనల మేరకు వీసీ అల్దాస్ జానయ్య, సుస్థిర వ్యవసాయ కేంద్రం సంచాలకుడు సమరేందు మహంతిలు మద్దతు ధరల విధానంపై అధ్యయనం చేసి సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించారు.

**నివేదికలోని ముఖ్యాంశాలు..**

ఆది నుంచి కేంద్రం.. వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్ సిఫార్సులను అనుసరించి ధరల విధానం ఖరారు చేస్తోంది. సమగ్ర ఉత్పత్తి వ్యయం కంటే 50% ఎక్కువగా ఉండాలని 2006లో స్వామినాథన్ కమిటీ సిఫార్సు చేయగా 2014 వరకు ఈ విధానాన్ని అనుసరించింది. దాని వల్ల వరి కనీస మద్దతు ధర 200708 నుంచి 201314 వరకు సగటున ఏడాదికి 12% పెరిగింది. తర్వాత కేంద్రం మార్పులు చేసింది. ఫలితంగా 201314 తర్వాత ఇది కేవలం 5%గా నమోదైంది.

# త్యాగానికి, విశ్వాసానికి ప్రతీక బక్రీద్

* **రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.**




నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : త్యాగానికి, విశ్వాసానికి ప్రతీక బక్రీద్ అని రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్లగొండ పట్టణంలో మునుగోడు రోడ్ లో ఉన్న ఈద్గా లోముస్లింల ప్రార్థన అనంతరం వారిని కలిసిబక్రీద్ (ఈద్ ఉల్ అజ్హా) పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ప్రవక్త ఇబ్రహీం అలైహిస్సలాం త్యాగం, విశ్వాసం, మానవతా విలువలను స్మరించుకుంటూ జరుపుకునే బక్రీద్ పండుగ సమాజానికి ఐక్యత, సహనం, పరస్పర ప్రేమాభిమానాల సందేశాన్ని అందిస్తుందని మంత్రి అన్నారు. బక్రీద్ పవిత్ర పండుగ అని,బక్రీద్ పండుగ ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి, సౌభాగ్యాలను నింపాలని ఆకాంక్షించారు. తెలంగాణ లో అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో కలిసి జీవించడం రాష్ట్ర ప్రత్యేకత అని, ఆ స్ఫూర్తి మరింత బలపడాలని మంత్రి ఆకాంక్షించారు. నల్గొండ పట్టణంలో గత 30 సంవత్సరాలుగా ఎలాంటి మత ఘర్షణలు లేకుండా అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి సోదరభావంతో జీవిస్తున్నారని అన్నారు. ముస్లింల అభివృద్ధికి ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందన్నారు. భవిష్యత్తులో కూడా ఎలాంటి ఘర్షణలు లేకుండా ప్రజలంతా ఐక్యంగా జీవించాలని ఆకాంక్షించారు.జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ మాట్లాడుతూ త్యాగం ,సేవా మార్గాన్ని గుర్తు చేసే పండుగ బక్రీద్ అని అన్నారు. ముస్లిం ల కు ఆయన బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్. వై .అశోక్ రెడ్డి ,ఏఎస్పి రమేష్, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, గ్రంథాలయ చైర్మన్ హాఫీజ్ ఖాన్, కార్పొరేషన్ కమిషనర్ శరత్చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి ,స్థానిక కార్పొరేటర్ మామిడి కార్తీక్,తదితరులు పాల్గొన్నారు .

## బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతిరూపం

* **మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతిరూపమని జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. గురువారం బక్రీద్ పండుగను పురస్కరించుకుని జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మగ్దుమ్ నగర్ లోని ఈద్గా లో ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థన (నమాజ్) లో మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం సోదరులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ ప్రజలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. బక్రీద్ పండుగ రోజున ముస్లింలు పేదలకు దానం చేయడం ఆనవాయితీగా కొనసాగుతుందన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ సర్వ మతాలకు నిలయమన్నారు. కుల మతాలకు అతీతంగా వేడుకలు నిర్వహించుకుని మతసామరస్యాన్ని చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ రషీద్, మహమూద్, హాజీ, అన్వర్, యాసీన్, జాంగిర్, చాంద్ పాషా, సత్తిరెడ్డి, జనగామ శ్రీధర్, సాయిల్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు ప్రజల ఖ్యాతిని విశ్వ వ్యాప్తంగా తీసుకెళ్లిన గొప్ప మహనీయుడు ఎన్టీఆర్

* **కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తెలుగు ప్రజల ఖ్యాతిని విశ్వ వ్యాప్తంగా తీసుకెళ్లిన గొప్ప మహనీయుడని కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా గురువారం కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ఐడిపిఎల్ చౌరస్తా లోని నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి వారిని స్మరించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి బడుగు బలహీన వర్గాలు అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారన్నారు. సినీ రంగంలో గొప్ప నటనతో ప్రజల మన్ననలు పొందారని గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జయరాం, రంగారావు, కూన రాఘవేందర్ గౌడ్, మోటె శ్రీనివాస్ యాదవ్, గడ్డం రాజేందర్ రెడ్డి, రవి, దిలీప్, శంకరయ్య, రవీందర్ గుప్తా, మల్లం శీను, శంకర్ గౌడ్, తోకల శీను, శ్రీకాంత్ ,చోటు ఓంకార్, శివ, సురేందర్, క్రాంతి, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది

* **గండ్ర సత్యనారాయణ రావు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని భూపాలపల్లి, గణపురం కేంద్రాల్లోని ఈద్గాహ్‌లలో ముస్లిం సోదరులతో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తోందన్నారు. షాదీ ఖానాలు, ఈద్గాహ్‌ల అభివృద్ధితో పాటు పలు సంక్షేమ పథకాల ద్వారా ముస్లిం సోదర సోదరీమణుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. సమాజంలో సౌభ్రాతృత్వం, ఐక్యత పెంపొందించే పండుగలు అందరికీ ఆదర్శమని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కోఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, ముస్లిం పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## పుష్కర భక్తులకు ఉచిత అన్నదానం



కాళేశ్వరం, ప్రజాస్ఫూర్తి : సరస్వతి అంత్య పుష్కరాలకు భారీగా తరలివస్తున్న భక్తుల కోసం కాళేశ్వరం దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదాన సత్రం వద్ద ఉచిత అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పుష్కర స్నానాల అనంతరం భక్తులు ఆహార సమస్యలు ఎదుర్కొనకుండా ప్రత్యేక అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రతిరోజూ పరిశుభ్రమైన, నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారు.దేవస్థానం సిబ్బంది, వాలంటీర్లు సమన్వయంతో అన్నదానం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నారని అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిశుభ్రత, ఆహార నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు దేవస్థానం ఈఓ మహేష్ పేర్కొన్నారు. భక్తులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పిస్తూ కాళేశ్వరం పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడుతోంది.

## గాలివాన బీభత్సం..
# బాధితులకు ఎమ్మెల్యే గండ్ర భరోసా



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : చిట్యాల మండలం నైన్‌పాక గ్రామంలో అకాల వర్షం, ఈదురుగాలులతో ఇండ్లు కూలిపోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గాలిదుమారం ధాటికి దెబ్బతిన్న ఇండ్లను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గురువారం స్వయంగా పరిశీలించి బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు. ఇళ్లను కోల్పోయి ఆవేదనలో ఉన్న కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఎమ్మెల్యే.. ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. పూర్తిగా కూలిపోయిన ఇండ్ల బాధితులకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. సంబంధిత అధికారులతో చర్చించి అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రకృతి విపత్తుతో నష్టపోయిన ప్రజలను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్న ఎమ్మెల్యే, తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామ ప్రజలు సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, సర్పంచ్ నక్కా భాస్కర్ యాదవ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కంకణాల శంకర్, తోట్ల రాజయ్య, కంచర్ల రాములు, యువజన కాంగ్రెస్ నాయకుడు అందుగుల రాజు, కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగ భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



ప్రజా స్ఫూర్తి, వికారాబాద్ : వికారాబాద్ జిల్లాలో బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకునేందుకు వీలుగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తెలిపారు. ఇందులో భాగంగా గురువారం ఆమె జిల్లాలోని పాత తాండూర్ ఈద్గా , వికారాబాద్ పట్టణంలోని అలంపల్లి ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈద్గా వద్ద ప్రార్థనలకు హాజరయ్యే ముస్లిం సోదరులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో, సోదరభావంతో పండుగను జరుపుకోవాలని కోరుతూ, బక్రీద్ ప్రార్థనలలో పాల్గొన్న ముస్లిం సోదరులందరికీ జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం ఎస్పీ ఈద్గా ల దగ్గర ప్రార్థనలకు వచ్చిన చిన్న పిల్లలకు ఈద్ ముబారక్ తెలుపుతూ చిన్నపిల్లలకు చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాండూర్ డీఎస్పీ ఎన్. యాదయ్య, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, ఇతర పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## మానుకోటలో ఘనంగా సావర్కర్ జయంతి వేడుకలు




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వినాయక్ దామోదర్ సావర్కర్ 143 వ జయంతి వేడుకలను నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో మానుకోటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు వీర సావర్కర్ కేవలం దేశభక్తుడే కాకుండా, భారత స్వాతంత్ర్య ఉద్యమానికి తన యౌవనాన్ని, జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని, "దేశం కోసం మరణించడం మాత్రమే కాదు, దేశం కోసం జీవితాంతం జీవించి పోరాడిన వ్యక్తి నేటి యువత ఆయన దేశభక్తి, త్యాగం, సామాజిక సంస్కరణ భావాలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చాడు.ఈ కార్యక్రమంలో నేతాజీ సేవా సమితి ఉప కార్యదర్శి కుర్యావుల గంగాధర్, ఆర్గనైజింగ్ కన్వీనర్ సామ శ్రీనివాస్, భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వివి నాగేందర్, ముదిగొండ విశ్వనాథం,జై ప్రకాష్‌లోయ, అక్కెర మోహన్‌రావు, చిట్టిమల్ల రఘు, శ్రీరంగం ఉపేందర్, వక్కల శ్రీనివాస్, బొమ్మరాతి భద్రయ్య, చేపూరి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## పాలకుర్తిలో జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

* **కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి మదార్**



ప్రజాస్ఫూర్తి, పాలకుర్తి : హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాలకుర్తిలో నిర్వహించ తలపెట్టిన జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జనగాం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి మదార్ ఓ ప్రకటనలో కోరారు. మారుమూల ప్రాంతంలో నిరుద్యోగ యువకులకు మంచి అవకాశాలు కల్పించాలని సదుద్దేశంతో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఝాన్సీ రెడ్డి, పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డిల పర్యవేక్షణలో ఈ జాబ్ మేళా జరుగుతుందని తెలిపారు. సుమారు 30 వరకు ఎం.ఎన్.సి కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగార్థులను ఎంపిక చేసుకుంటారని తెలిపారు. ఐటీ, ఫైనాన్స్, మ్యానుఫ్యాక్చరింగ్, హాస్పిటాలిటీ, బ్యాంకింగ్, బిపిఓ తదితర రంగాలకు చెందిన కంపెనీలు వస్తున్నాయని పేర్కొన్నారు. పదో తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు చదువుకున్న వారు ఈ ఉద్యోగంలలో పాల్గొనవచ్చును తెలిపారు. స్థానిక శ్రీ సోమేశ్వర ఆలయ కళ్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాబ్ మేళా జరుగుతుందన్నారు. స్థానిక పాలకుర్తి నియోజకవర్గం నిరుద్యోగులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మదార్ విజ్ఞప్తి చేశారు

## పుష్కరాలకు కాళేశ్వరం ముస్తాబు

* **భక్తుల కోసం ప్రత్యేక పారిశుధ్య చర్యలు**



కాళేశ్వరం, ప్రజాస్ఫూర్తి : సరస్వతి అంత్య పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వరం గ్రామపంచాయతీ పరిధిలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. పుష్కరాలకు భారీగా భక్తులు తరలివస్తుండటంతో ప్రధాన రహదారులు, ఘాట్‌ల మార్గాలు, పార్కింగ్ ప్రదేశాలు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో ప్రతిరోజూ ప్రత్యేక శుభ్రత పనులు నిర్వహిస్తున్నారు.వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఉపశమనం కలిగించేలా ప్రధాన రహదారులపై ట్యాంకర్ల ద్వారా రోజుకు పలుమార్లు నీటి చల్లింపు చేపడుతున్నారు. దీంతో దుమ్ము తగ్గి చల్లదనం నెలకొంటోందని అధికారులు తెలిపారు.పారిశుధ్య కార్యక్రమాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ ఎక్కడా లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. భక్తులు కూడా పరిశుభ్రత పాటించి చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లో వేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ విజ్ఞప్తి చేశారు.

## రైతు గోసపై గండ్ర ఫైర్

* **ధాన్యం కొనుగోళ్లపై గండ్ర వెంకట రమణారెడ్డి తీవ్ర విమర్శలు**




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి: రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాల మధ్య రైతులు నలిగిపోతున్నారని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి మండిపడ్డారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయి రైతులు అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. "రైతులు పండించిన పంటను రోడ్డుపై వేసి నిప్పంటించినా ప్రభుత్వానికి చలనం లేదు. సీఎం మాత్రం గాలిలో తిరుగుతున్నారు" అంటూ తీవ్ర విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోనే రైతులు రోడ్డెక్కి నిరసనలు తెలపాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. రానున్న రోజుల్లో వర్షాల హెచ్చరికలు ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, వర్షాలకు తడిసే ప్రతి ధాన్య గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. "రైతు గోస-బీజేపీ భరోసా యాత్ర పేరుతో రైతుల బాధల కంటే ప్రచార హంగామాకే బీజేపీ నాయకులు ప్రాధాన్యం ఇస్తున్నారు" అని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యేకు రిబ్బన్ కటింగ్‌లపై ఉన్న శ్రద్ధ పంట కొనుగోళ్లపై లేదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా వ్యవహరించి రైతులను ఆదుకోవాలని కోరారు.అదేవిధంగా రైతులు పంట అవశేషాలను కాల్చొద్దని విజ్ఞప్తి చేశారు. పంట పొలాలను తగలబెట్టడం వల్ల పర్యావరణానికి నష్టం కలగడమే కాకుండా ప్రాణాపాయం కూడా ఏర్పడుతుందని హెచ్చరించారు. గ్రామాల్లో తలెత్తుతున్న మంచినీటి సమస్యల పరిష్కారానికి అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దని, ముఖ్యంగా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శిలాఫలకాల ధ్వంసంపై కూడా స్పందించిన ఆయన, "మీరు పాటించే సంప్రదాయాన్నే రేపు మీ తరువాతివాళ్లు కూడా పాటిస్తారు" అంటూ హెచ్చరించారు.

# మానుకోట ప్రతిఘటన భావితరాలకు స్ఫూర్తిదాయకం

*** తెలంగాణ ఉద్యమ నేత శంతన్ రామరాజు**




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మానుకోట ప్రతిఘటన భావితరాలకు స్ఫూర్తిదాయకమని తెలంగాణ ఉద్యమ నేత శంతన్ రామరాజు అన్నాడు. మానుకోట ఘటన జరిగి పదహారేండ్లు అయిన సందర్భంగా స్థానిక రైల్వేస్టేషన్లో మానుకోట రాళ్లను ప్రదర్శిస్తూ నాటి ఘటనను స్మరించుకున్నాడు. ఈ సందర్భంగా శంతన్ రామరాజు మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదిన నాటి ఘటన ప్రపంచ ఉద్యమాల చరిత్రలో మైలురాయి వంటిదన్నారు. ఓదార్పు యాత్ర ముసుగులో తెలంగాణ తల్లి గుండెల మీద నడవాలనుకున్న వైఎస్. జగన్మోహన్ రెడ్డికి మానుకోట రాళ్లు గుణపాఠం నేర్పాయన్నారు. ఊరూ, వాడా ఉప్పెనై ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమ కెరటాలు రక్తపు ముగ్గులు పోసి సీమాంధ్ర పెత్తందారీ రుబాబును తరిమికొట్టారన్నాడు. తెలంగాణ ఉద్యమ చరిత్రంతా ఓ ఎత్తైతే... మహిమ గల మానుకోట రాళ్ళ ప్రతిఘటన మరో ఎత్తని అన్నాడు. అయితే నాటి ఘటన స్ఫూర్తిగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నాడు. తెలంగాణ ఉద్యమాన్ని అణచివేసినోళ్లు, ఉద్యమకారుల ఈపులు ఇమానం మోత మోగించినోళ్లు పదవులు అనుభవిస్తుంటే నాలాంటి ఎందరో ఉద్యమకారులు కోర్టుల చుట్టూ తిరిగామని ఆవేదన వ్యక్తంచేశాడు. గుంజె హన్మంతు, బాధరబోయిన రాఘవులు, తూము వెంకన్న, భూక్య సత్యనారాయణ, ముత్తుదొర లాంటి ఎందరో ఉద్యమకారులు ప్రభుత్వం నుండి ఎలాంటి గుర్తింపు, సహాయం లేకుండానే అసువులు బాస్తున్నారని బాధను వ్యక్తపరిచాడు. ప్రతి ఉద్యమకారునికి 250 గజాల జాగకు తోడు ప్రతి నెలా గౌరవ భృతి ఏర్పాటు చేయాలన్నారు.ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీమీద పూర్తి స్థాయిలో విశ్వాసం ఉందన్నారు. కమిటీ కార్యక్రమాలు సైతం మానుకోట నుండే ప్రారంభిస్తే తెలంగాణలోని సబ్బండవర్గాలు హర్షం వెలిబుచ్చుతాయని అన్నారు. ప్రతియేటా మానుకోట ఘటనను స్మరించుకునేలా భవిష్యత్ తరాలకు తెలంగాణ వీరత్వాన్ని అందించేలా ఉద్యమకారులు కలసికట్టుగా కార్యక్రమాన్ని నిర్వహిస్తే బాగుంటుందని పేర్కొన్నారు. గతం, వర్తమానమే కాకుండా భవిష్యత్తులో తెలంగాణ వైపు కన్నెత్తి చూసే ఎవరికైనా మానుకోట రాళ్లు తరిమితరిమి కొడతాయని స్పష్టంచేశారు.

## బక్రీద్ పండుగ సందర్భంగా బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ ఆకస్మిక తనిఖీలు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి :బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా మహబూబాబాద్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డా. శబరీష్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ పట్టణంలో బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.టౌన్ సీఐ ఎల్. రఘుపతి రెడ్డి, జి. ఉమా ఆధ్వర్యంలో ఈద్గా, దర్గాలు, పట్టణంలోని ప్రధాన కూడళ్లు, రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, నెహ్రూ సెంటర్, తొర్రూరు బస్ స్టాండ్ సెంటర్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తులు, బ్యాగులు వస్తువులను బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు క్షుణ్ణంగా పరిశీలించాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వస్తువులు లేదా వ్యక్తులు కనిపించిన వెంటనే సమీప పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ తనిఖీల్లో అంజయ్య, అశోక్, మురళి (డాగ్ హ్యాండ్లర్), ఆర్పీఎఫ్ సిబ్బంది ఆర్. సార్య, కె. నాగిరెడ్డి, డాగ్ హ్యాండ్లర్ ఎల్. సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం రవాణాపై ఎమ్మెల్యే గండ్ర ఆందోళన

*** కొనుగోలు కేంద్రాల సమస్యలు పరిష్కరించాలని మంత్రులకు విజ్ఞప్తి**




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : హన్మకొండ కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన వరి ధాన్యం కొనుగోలు సమీక్షా సమావేశంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శాయంపేట మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రవాణా సమస్యలు ఉన్నాయని మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించారు. కార్యక్రమంలో హన్మకొండ, వరంగల్, జనగామ జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం

*** జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: అకాల వర్షాల కారణంగా రాష్ట్రంలోని జిల్లాల్లో ధాన్యం తడిసిన పరిస్థితులు నెలకొన్నప్పటికీ రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు అమలు చేస్తోందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా వేగంగా కొనుగోళ్లు నిర్వహిస్తోందని తెలిపారు.మెదక్ జిల్లాలో ఇప్పటివరకు అకాల వర్షాల ప్రభావంతో తడిసిన ధాన్యం సుమారు 04వేల క్వింటాళ్ల ధాన్యం బాయిల్డ్ మిల్లులకు తరలించామన్నారు.రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రాబోయే రోజుల్లో కూడా ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. అనుకొని పరిస్థితుల వర్షాలతో ధాన్యం తడిసినా, నిబంధనల ప్రకారం పరిశీలించి కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.రైతులకు ధాన్యం కొనుగోలులో సమస్యలు, సందేహాల పరిష్కారం కోసం జిల్లా సివిల్ సప్లయ్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్/కంట్రోల్ రూం నంబర్. 9391942254 ను సంప్రదించాలనీ పేర్కొన్నారు.

**ముస్లిం సోదర సోదరీమణులకు బక్రీద్ పండగ శుభాకాంక్షలు**

బక్రీద్ పండగను పురస్కరించుకొని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ ముస్లిం సోదరీ, సోదరీమణులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దైవాజ్ఞను అనుసరించి సమాజాహితం కోరి ప్రతి మానవుడు నిస్వార్థ సేవలను అందించాలని సందేశం బక్రీద్ మనకు అందిస్తుందన్నారు. తమకు కలిగిన దాంట్లోంచి ఎంతోకొంత పంచడమే దాతృ స్వభావాన్ని బక్రీద్ పండుగ ద్వారా నేర్చుకోవాలన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలి

*** సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి.**




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : భారత కమ్యూనిస్టు పార్టీ మహబూబాబాద్ పట్టణ కౌన్సిల్ సమావేశం. వీరభవన్ సిపిఐ జిల్లా కార్యాలయం లో నర్రా శ్రావణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కౌన్సిల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి మాట్లాడుతూ జూన్ రెండున తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లావ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో సిపిఐ చారిత్రాత్మక పోరాటం నిర్వహించిందని అన్నారు. మలిదశ ఉద్యమంలో జిల్లా వ్యాప్తంగా అనేక ఆందోళనలు రైలు రోకోలు, బిజిలీ బంద్, ఎమ్మెల్యే, ఎంపీల ఇండ్లు ముట్టడి అనేక మిలిటెంట్ పోరాటాలు అనేకసార్లు తెలంగాణకై పాదయాత్రలు నిర్వహించి తెలంగాణ రావడంలో సిపిఐ పోరాటం చరిత్రలో నిలిచిపోతుందన్నారు.అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నాడు ఎన్నికల ముందు అధికారంలోకి రాగానే తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి 250 గజాల స్థలం ఇచ్చి వారిని గౌరవించుకుంటామని తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం జూన్ 2న జరిగే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం లోపు తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారిని గౌరవించి వారికి అన్ని విధాలా సహకారం అందించాలని తెలిపారు. నాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిర్వహించి మలిదశ ఉద్యమంలో మహబూబాద్ జిల్లా కేంద్రంలో మిలిటెంట్ పోరాటాల ద్వారా తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన పార్టీ సిపిఐ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని సిపిఐ శ్రేణులు ఘనంగా నిర్వహించాలని తెలిపారు ఈ సమావేశంలో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి,సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, పట్టణ సహాయ కార్యదర్శులు 18 వ వార్డు కౌన్సిలర్ రేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు మామిండ్ల సాంబలక్ష్మి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు వెలుగు శ్రవణ్, కేదాసు రమేష్, వంకాయలపాటి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## చినుకులుపడి బస్ షెల్టర్ చేరిన డ్రెయిన్ నీరు

**– దుర్గంధంతో ప్రయాణీకుల అవస్థలు**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:ఎగువ నుండి వచ్చే డ్రెయినేజీ నీరు పోవడానికి మార్గం లేకపోవడంతో రోడ్డుపైకి చేరుతున్నాయి. దీంతో పక్కనే ఉన్న బస్ షెల్టర్ ఎదురుగా మురుగునీరు చేరడంతో దుర్గంధభరితంగా మారి ప్రయాణీకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే.... కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రామవరం 15వ డివిజన్లో డ్రైనేజీ సమస్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. జాతీయ రహదారిపై ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బస్ షెల్టర్కు ఆనుకుని డ్రెయినేజీ ఉంది. అయితే ఈ డ్రెయినేజీలో ఎగువ ప్రాంతాల నుంచి మురుగునీరు పారుతుంది. అయితే డ్రెయినేజీని బస్ షెల్టర్ వరకు నిర్మించి వదిలేయడంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు మరో మార్గంలో వెళ్లే అవకాశం లేకపోవడంతో నేరుగా జాతీయ రహదారిపైకి చేరుతుంది. ఫలితంగా ప్రతిరోజు మురుగునీరు రోడ్డుపై నిలిచి దుర్గంధాన్ని వెదజల్లుతోంది. ఇదిలా ఉండగా గురువారం ఉదయం కురిసిన స్వల్ప వర్షానికే పరిస్థితి దారుణంగా మారింది. ఎగువ నుంచి డ్రెయినేజీ ద్వారా వచ్చిన మురుగు నీరు మొత్తం బస్ షెల్టర్ ముందు చేరడంతో జలమయమై, ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మురుగు నీటిని తొలగించేందుకు మున్సిపల్ సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ఒక దశలో బేషిన్లతో నీటిని తోడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎప్పుడూ రద్దీగా ఉండే జాతీయ రహదారిపై సిబ్బంది పని చేస్తున్న సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశముందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై గతంలో ప్రజావాణి, మున్సిపల్ కమిషనర్కు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పరిష్కారం మాత్రం కనిపించడం లేదని స్థానికులు ప్రజలు వాపోతున్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రామవరం అంబేద్కర్ సెంటర్ బస్ షెల్టర్ పక్కనే ఉన్న డ్రెయినేజీ నీరు ప్రధాన డ్రెయినేజీకి కలిపి మురుగు నీరు జాతీయ రహదారిపై పారకుండా శాశ్వత చర్యలు తీసుకొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం మెదక్ పట్టణంలో నవాబ్ పేట్ ఈద్గా వద్ద ఘనంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ ఈ కార్యక్రమంలో పాల్గొని ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ మత సామరస్యానికి ప్రతీక అని, ఏ పండుగ జరుపుకున్న కులమత బేధాలు లేకుండా అందరూ కలిసిమెలిసి ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవడం మంచి పరిణామం అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా పోలీసులు పలు ప్రాంతాలలో భద్రత ఏర్పాట్లు చేపట్టి ఎలాంటి వాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డిఎస్పి ప్రసన్నకుమార్, పట్టణ సిఐ మహేష్, పోలీస్ సిబ్బంది, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## హమాలీ కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

*** బైరగోని బాలయ్య**




రఘునాథపల్లి, ప్రజాస్ఫూర్తి : హమాలీ కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించు కోవడం లేదని హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు బైరగోని బాలయ్య విమర్శించారు. ఈ నెల 30 వ తేదీన జిల్లా కేంద్రంలో జరిగే ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐ టీయూ) రాష్ట్ర 4వ మహాసభను విజ యవంతం చేయాలని కోరుతూ మండ ల కేంద్రంలోని ఐకేపీ సెంటర్ వద్ద గురు వారం గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీ కార్మికులు తీవ్రశ్రమతో జీవనం సాగిస్తున్నప్పటికీ వారి సమస్యలు పరి ష్కారం కావడం లేదన్నారు. అధిక బరు వులు మోయడం వల్ల చిన్న వయసులో నే అనారోగ్యానికి గురవుతున్నారని అ న్నారు.పని ప్రదేశాల్లో ప్రమాదాలు జరిగి అనేక కుటుంబాలు ఇబ్బందులు పడు తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి బడ్జెట్ లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతీ కార్మికునికి రూ.6 వేల పెన్షన్, వృద్ధాప్యంలో ఉన్న వారికి రూ.9వేల సామాజిక భద్రత పెన్షన్ అందించాలని కోరారు. ప్రమాదాల్లో మరణించిన కార్మి కుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా,పీఎఫ్,ఈఎస్ఐ,ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చే శారు. ఈ మహాసభ ద్వారా హమాలీ కార్మికుల సమస్యల పై రాష్ట్ర స్థాయి లో చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూ పొందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం లో హమాలీ యూ నియన్ నాయకులు షాడా వెంక టయ్య,ద్యావర రమేష్, వెం కట్ నర్సు, పరుశురాములు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## మల్లయ్య దేవుడి పండగ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



ప్రజాస్ఫూర్తి, పెబ్బేరు: పెబ్బేరు మండల పరిధిలోని కంచిరావుపల్లి గ్రామంలో గురువారం ప్రారంభమైన మల్లయ్య దేవుడి పండగల కార్యక్రమంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మల్లయ్య ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాలల్లో నిర్వహించుకునే ఇలాంటి పండగల ద్వారా గ్రామస్తుల మధ్య ఐక్యత నెలకొంటుందని, ఇలాంటి పండుగలు జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాపర్ల రాంరెడ్డి, గ్రామ సర్పంచ్ అరుణ జయపాల్ రెడ్డి, గ్రామ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 5 లక్షల ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే



ప్రజాస్ఫూర్తి , జన్నారం : జన్నారం మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన కండ్ల రాములు కుమార్తె ప్రేమలత ఆటోఇమ్యూన్ ఎన్సెపాలిటీస్ అనే తీవ్రమైన ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నది, ఆమెకు అత్యవసర శస్త్ర చికిత్స కోసం దాదాపు 5 లక్షలకు వరకు ఖర్చు అవుతుందని వైద్యులు సూచించారు. వారు నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో, ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం రోజున ఆమె కుటుంబ సభ్యులకు రూపాయలు 5 లక్షల ఎల్ఓసి అందజేశారు. చికిత్స నిమిత్తం ఐదు లక్షల ఎల్ఓసిని అందజేసిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# జనగామ లో చెలరేగిన మంటలు

*** తప్పిన పెను ప్రమాదం**



జనగామ, ప్రజాస్ఫూర్తి : పట్టణం లోని సూర్యాపేట రోడ్డు లో గల కోటిరత్న హాస్పిటల్ వెనుక భాగంలో ఉన్న ఖాళీ స్థలంలో గురువారం భారీగా మంటలు చెలరేగి స్థానికులను భయాందోళనకు గురిచేశాయి. పగిటిపాటి దేవయ్య (ఎన్నారై) కుటుంబానికి చెందిన సుమారు మూడున్నర ఎకరాల స్థలంలో మధ్యాహ్నం సమయంలో మంటలు అంటుకొని గాలి వేగానికి భారీగా వ్యాపించాయి.మంటలు సమీప ఇండ్ల వైపు వ్యాపించే ప్రమాదం ఉండటంతో స్థానికులు బోర్ల సహాయంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో వెంటనే ఫైర్ డిపార్ట్‌మెం ట్‌కు సమాచారం అందించగా ఆలేరు నుండి వచ్చిన ఫైర్ ఇంజన్ మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. అదుపులో కి వచ్చిన కొద్దిసేపటికే మళ్లీ మంటలు చెలరేగడంతో స్థానికులు మూడో వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి ద్వారా, డీసీపీ రాజమహేంద్ర నాయక్, సీ.ఐ సత్య నారాయణ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి లకు సమాచారాని అందించగా అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని జనగామ ఫైర్ ఇంజన్,మున్సిపల్ వాటర్ ట్యాంకర్ల సహాయంతో ఇన్ చార్జ్ ఫైర్ ఆఫీసర్ బి.జగదీశ్వర్ ఆధ్వ ర్యంలో ఫైర్ సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి,స్థానికులు ధరా వత్ రాంకిషన్ నాయక్, బాల్నే విద్యా సాగర్, బిల్లా మనోహర్ తదిత రులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కడియం



స్టేషన్ ఘనపూర్ / జనగామ, ప్రజాస్ఫూర్తి : హజ్రత్ ఇబ్రహీం త్యాగానికి ప్రతీకగా నిర్వహించుకునే బక్రీద్ (ఈద్ ఉల్ అదా) పర్వదినం సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముస్లిం సోదర సోదరీమణులకు ఈద్ ముబారక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ స్వార్థం, అసూయ, రాగ ద్వేషాలను విడిచిపెట్టి మానవు ల్లో త్యాగభావాన్ని పెంపొందించడమే బక్రీద్ పండుగ ప్రధాన సందే శమని పేర్కొన్నారు. త్యాగబుద్ధి, నిజమైన భక్తిప్రపత్తులు కలిగి ఉన్నవారే దైవకృపకు పాత్రులవు తారని బక్రీద్ పర్వదినం తెలియ జేస్తోందన్నారు. నేటి ఆధునిక సమాజంలో సాటి మనిషిని ప్రేమించి, ఆదరించే వారే నిజమై న దైవభక్తులుగా నిలుస్తారని ఎమ్మెల్యే కడియం అన్నారు. హజ్రత్ ఇబ్రహీం త్యాగస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్క రూ సహృదయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.అల్లా ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పు డూ ఉండాలని ఆకాంక్షిస్తూ ముస్లిం సోదరులకు మరోసారి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

# పినరయి విజయన్ పై ఈ.డీ దాడుల వెనుక బీజేపీ, కాంగ్రెస్ కుట్ర

**: సింగారపు రమేష్**



జనగామ, ప్రజాస్ఫూర్తి : కేరళం మాజీ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యుడు పినర యి విజయన్ పై ఈ.డీ దాడులు రాజకీయ కక్ష సాధింపు లో భాగ మని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సింగారపు రమేష్ ఆరోపించారు. గురువారం విజ యన్ ఇంటిపై ఈ.డీ దాడులను నిరసిస్తూ నెహ్రూ పార్కు వద్ద జిల్లా కమిటీ సభ్యుడు సుంచు విజేందర్ అధ్యక్షతన సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కా ర్యదర్శివర్గ సభ్యులు సింగారపు రమేష్ మాట్లాడుతూ దేశానికే కేరళ ను ఆదర్శ రాష్ట్రంగా తీర్చి దిద్దిన పినరయిను రాజకీయం గా బలహీనపరచడానికే కేంద్ర ప్ర భుత్వం ఈ.డీ ని ఉపయోగిస్తోం దని విమర్శించారు.విచారణల్లో నూ విజయన్ పై ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదని, ఆయన పేరు ఎక్కడా ప్రస్తావనకు రాలేదన్నారు. వామపక్ష ఉద్యమాలను అణచివేసేందు కు కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించడం బీజే పీ కి కొత్త కాదని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు, బీజేపీ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ (ఎం) పోరా టం కొనసాగిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కూడా ఈ అంశం పై తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో సీపీఐ(ఎం) నాయకులు బూ డిద గోపి, పోత్కనూరి ఉపేందర్, బొట్టు సూరయ్య,యాదయ్య,ఐల మల్లు, సాల్మన్ రాజ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఎల్బీనగర్‌లో ఆగివున్న లారీని ఢీకొట్టిన కారు.. ఇద్దరికి తీవ్ర గాయాలు

హైదరాబాద్: ఎల్బీనగర్‌లో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిత్ర లేఅవుట్ సమీపంలో తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. సూర్యాపేట జిల్లాకు చెందిన ధరావత్ అశోక్ కారు నడుపుతుండగా రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని గమనించక ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసం కాగా, డ్రైవర్ అశోక్‌తో పాటు కారులో ప్రయాణిస్తున్న సరూర్‌నగర్‌కు చెందిన బొర్రా మధు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కామినేని ఆసుపత్రికి తరలించారు.

# పుష్కరాల్లో ఒడిస్సీ నృత్య వైభవం




*** భక్తులను మంత్రముగ్ధులను చేసిన శాస్త్రీయ ప్రదర్శనలు**

కాళేశ్వరం, ప్రజాస్ఫూర్తి : కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాలు ఆధ్యాత్మికతతో పాటు సాంస్కృతిక వైభవానికీ వేదికగా నిలుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో దేవాదాయ, భాషా సాంస్కృతిక శాఖల సహకారంతో పరంపర ఫౌండేషన్ నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గురువారం నిర్వహించిన ఒడిస్సీ నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి.కార్యక్రమాన్ని మంగళాచరణంతో ప్రారంభించిన కళాకారులు, మహాకవి కాళిదాసు రచించిన "శ్యామలా దండకం"లోని మాణిక్య వీణా శ్లోకాన్ని ఆధారంగా చేసుకుని మాతంగి దేవిని స్తుతిస్తూ అద్భుత నృత్యరూపకాన్ని ఆవిష్కరించారు. వీణావాదనం, చంద్రకళ, కదంబవన విహారం వంటి భావాలను హావభావాలతో జీవంతం చేశారు. అనంతరం త్రిఖండి ప్రణామం ద్వారా దేవతలు, గురువులు, ప్రేక్షకులకు నమస్కారం సమర్పించారు.తదుపరి ప్రదర్శించిన "బట్టు" నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఒడిశా దేవాలయ శిల్ప సంపదను ప్రతిబింబించే ఈ నృత్యంలో వీణ, మృదంగం, వేణువు వాయిస్తున్న శిల్ప భంగిమలను కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. "పల్లవి" నృత్యంలో సంగీతం, లయ, కదలికల సమన్వయం ప్రేక్షకులను ఆకట్టుకోగా, సంకరాభరణం రాగంలో సాగిన ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. అనంతరం "శివ పంచాక్షరి"లో పరమశివుని తాండవ రూపాన్ని శక్తివంతంగా ఆవిష్కరించారు. జటాజూటంలో గంగాధరుడు, త్రిశూలధారి, డమరుక నాదంతో కామదేవుని దహనం చేసిన మహాదేవుని రూపాన్ని హావభావాలతో కళాకారులు కళ్లకు కట్టినట్టు చూపించారు. చివరగా "మోక్ష" ప్రదర్శనతో కార్యక్రమం ముగిసింది. మహాకాళి ఉగ్రరూపం, ఆదిశక్తి తత్వాన్ని ఒడిస్సీ నృత్య భాషలో హృద్యంగా ఆవిష్కరించి ప్రేక్షకులను ఆధ్యాత్మిక భావావేశంలో ముంచెత్తారు.పుష్కరాల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సాంస్కృతిక కార్యక్రమాలు భారతీయ శాస్త్రీయ కళల వైభవాన్ని చాటుతూ కాళేశ్వరాన్ని ఆధ్యాత్మిక సాంస్కృతిక కేంద్రంగా నిలుపుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.

# సిపిఎం పై కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

*** సిపిఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్**



రఘునాథపల్లి, ప్రజాస్ఫూర్తి : సిపిఎం పై కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ అన్నారు. గురువారం గురువారం రఘునాథపల్లి మండల కేంద్రంలో మండల కమిటీ అధ్వర్యంలో పినరాయి విజయన్ పై ఈడీ దాడుల నిరసిస్తూ స్థానిక అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ కేరళ మాజీ సీఎం పీనరయ్ విజయన్ నివాసంపై ఈడి జరిపిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు, ఇది ఒక అగ్రసేని ప్రతిపక్ష నాయకుడి పై కేంద్ర ప్రభుత్వం జరిపిన కక్షిత మైన దాడి అని విమర్శించారు, కేంద్ర ప్రభుత్వం రాజకీయ సవాళ్లను ఎదుర్కోలేకే ఇలాంటి కుయుక్తులు పన్నుతుందని వారు అన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రతిపక్షాలపై కేంద్ర ప్రభుత్వం దాడులు తీవ్రతరం చేసిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకులపై నేరుగా దాడులు జరుగుతూ ఉండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు, ప్రతిపక్షాలను ప్రశ్నించే మీడియాను సహించలేని స్థితిలో కేంద్ర ప్రభుత్వం ఉందని వారన్నారు. కేరళ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి సిపిఎం పొలిటి బ్యూరో సభ్యులు పినరై విజయన్ అద్దెకుంటున్న ఇంటిపై కేంద్ర ప్రభుత్వం ఐటీ సోదాలు చేపించడం అత్యంత హేయమైనా చర్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కడారి ఐలయ్య, పొదల లవ కుమార్, పులిగిల్ల రాజు, మండలి వెంకటయ్య, పులిగిల్ల లావణ్య, మండలి లలిత, మండలి మణెమ్మ, చొక్కాల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు

# సంపాదనలో కొంత భాగాన్ని ప్రజాసేవకు కేటాయించడం గొప్ప మానవత్వం

*** వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



ప్రజాస్ఫూర్తి, పెబ్బేరు: సమాజంలో ప్రతి మనిషి తాను సంపాదించిన దాంట్లో కొంత భాగాన్ని అవసరంలో ఉన్న ప్రజల కోసం, పేదల కోసం, అనారోగ్యంతో బాధపడుతున్న వారి కోసం, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఖర్చు చేయడం ఎంతో గొప్ప విషయమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. పెబ్బేరు మండలం గుమ్మడం గ్రామంలో బూజల సోమమ్మ రంగారెడ్డి మెమోరియల్ సొసైటి ఆధ్వర్యంలో వారి కుమారులు ఖగేందర్ రెడ్డి, హేమసుందర్ రెడ్డి, భువనేశ్వర్ రెడ్డిలు ఏర్పాటు చేసిన కంటిపొర ఉచిత చికిత్స శిబిరాన్ని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, జిల్లా అధ్యక్షులు శివసేనారెడ్డి, జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసేవ అనేది ధనవంతులకే పరిమితం కాదు. మనకు ఉన్న దాంట్లో కొంత పంచుకోవాలనే మనసు ఉంటే చాలు, ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నింపవచ్చునని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇతర దేశాల్లో ఉంటూ తమ గ్రామాన్ని గుర్తుంచుకొని తమ తల్లిదండ్రుల పేరున ఇలాంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసిన బి ఎస్ ఆర్ మెమొరబుల్ సొసైటీ వ్యవస్థాపకులు ఖగేందర్ రెడ్డి, హేమసుందర్ రెడ్డి, భువనేశ్వర్ రెడ్డిలను ఎమ్మెల్యే అభినందించారు. తనకు జన్మనిచ్చిన మంగంపల్లి గ్రామంలో గత గత 15, 20 సంవత్సరాలుగా గ్రామంలో సర్పంచిగా అయినప్పటి నుంచి ఆడబిడ్డల పెళ్లిళ్లకు తన వంతు ఆర్థిక సహాయంగా 21 వేలుతో పాటు పుస్తమెట్లను అందిస్తూ వస్తున్నానని,ఎంపీపీగా అయిన తర్వాత మండల స్థాయిలో నిరుపేద కుటుంబాల్లో మృతి చెందిన ప్రతి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయంగా 5000 రూపాయలను మేఘన్న అభయహస్తం ద్వారా అందిస్తూ వస్తున్నామని ఆయన తెలిపారు. నేడు వనపర్తి ఎమ్మెల్యేగా నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామంలో ఎంతోమంది చదువుకునే విద్యార్థులకు, ఆసుపత్రులకు, నిరుపేదలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూనే వస్తున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కన్నవారిని, జన్మనిచ్చిన గ్రామాన్ని ఎప్పటికీ మరువకూడదని తమకు తోచిన సహాయాన్ని అందిస్తూ రావాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, బీఎస్ఆర్ సొసైటీ సభ్యులు, గ్రామ సర్పంచ్ పుట్ట నాగేష్, ఉపసర్పంచ్ బొల్లి రాజు, మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి, జిల్లా మహిళా సమస్య అధ్యక్షురాలు ఇందిర, వనపర్తి పట్టణ కౌన్సిలర్లు, గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఈద్గా మైదానంలో భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు

*** వేసవి దృష్ట్యా ప్రత్యేక టెంట్లు ఏర్పాటు చేసిన అధికారులు**



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా వ్యాప్తంగ గా ఈద్గా మైదానాలల్లో బక్రీద్ సందర్భం గా ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఈద్ ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. పట్టణం లో జమీయతుశ్ శబాబ్ కమిటీ ఆధ్వ ర్యంలో నిర్వహించి న ప్రార్థనల్లో పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. జా మియా మస్జీద్ ఇమామ్ షాకీర్ హుస్సే న్ ఖుత్బా మరియు నమాజ్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియ ర్ నాయకుడు, ప్రముఖ వ్యాపారవేత్త మాజీద్ ఆఫ్సర్ మాట్లాడుతూ, తీవ్ర వేసవి పరిస్థితులను దృశ్య వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడకుండా ఈద్గా మైదానంలో ప్రత్యేక టెంట్లు ఏర్పాటు చే యాలని ఎంపీ చామాల కిరణ్ కుమార్ రెడ్డిని కోరినట్లు తెలిపారు. స్పందించిన ఎం.పి, జిల్లా కలెక్టర్, మున్సిపల్ శాఖ అధికారులకు వెంటనే తగిన చర్యలు తీసుకోవా లని సూచించగా అధికారు లు ఈద్గా మైదానం అంతటా ప్రత్యేక టెంట్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భారీ సంఖ్యలో తరలివ చ్చిన ప్రజలు ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రార్థనలు నిర్వహించుకునేలా సహకరించిన ఎం.పీ చామాల కిరణ్ కుమార్ రెడ్డి, చేర్యాల మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, మున్సిపల్ చైర్మన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ లకు మాజీద్ ఆఫ్సర్ కృతజ్ఞత లు తెలిపారు. ఈ కార్య క్రమంలో జమీయతుశ్ శబాబ్ కమిటీ అధ్యక్షులు సాజిద్, కార్యదర్శి గౌస్, కోశాధికారి జానీ, జామియా మస్జీద్ అధ్యక్షులు మసి ఉర్ రెహమాన్, శబాబ్ మాజీ అధ్యక్షుడు షకీల్, కాంగ్రెస్ నాయకులు గౌస్, అజర్, ఖాదర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు




ప్రజాస్ఫూర్తి ,జన్నారం: తెలంగాణ తెలుగుదేశం పార్టీ ఆదిలాబాద్ పార్లమెంటరీ అడహక్ కమిటీ సభ్యులు పులి శెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 103 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు ఉద్యోగాలు, రెండు రూపాయలకే కిలో బియ్యం, కూడు, గూడు, నీడ లాంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టి పటేల్, పట్వారి వ్యవస్థను రద్దుచేసి మండల వ్యవస్థను తయారుచేసిన మహానుభావుడు స్వర్గీయ నందమూరి తారక రావు అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి ప్రసాద్, ఉపాధ్యక్షుడు గంధం పద్మారావు,ముత్యంపెల్లి నవీన్,పులిశెట్టి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు, గోదాముల తనిఖీ

**: అదనపు కలెక్టర్ బెన్ షా లోమ్**



జనగామ,ప్రజాస్ఫూర్తి : జిల్లాలో ధాన్యం సేకరణ,నిల్వ ప్రక్రియను వేగవంతం చేసేం దుకు అదనపు కలెక్టర్ బెన్ షా లోమ్ (రెవెన్యూ) గురువారం క్షేత్ర స్థాయిలో పర్య టించారు. ఈ సందర్భం గా జిల్లా లోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలు,గోదాములను స్వయం గా సం దర్శించి జరుగుతున్న పనులను పరిశీలించారు. పిట్టల గుట్ట గోదాం వద్ద జరుగుతున్న ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను తనిఖీ చేసి,పనులను వేగవంతం గా చేయాలని అధికారులకు సూ చించారు. రఘునాథపల్లి లో ఐకే పీ ధాన్యం కొను గోలు కేంద్రాన్ని సందర్శించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరణ చేపట్టాలని అధికారుల ను ఆదేశించారు. తరిగొప్పుల మండలంలో పాక్స్ గోదామును పరిశీలించి అక్కడ జరుగుతున్న అన్ లోడింగ్ ప్రక్రియ పై సమీక్ష నిర్వహించారు.లింగాల ఘణపురం మండలం, నెల్లుట్ల గోదామును సం దర్శించి ధాన్యం నిల్వల పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొను గోలు చేస్తుందని తెలిపారు. ధాన్యం సేకరణ లో ఎటు వంటి జాప్యం జరగకుండా అన్ని చర్యలు తీసు కుంటున్నామని పేర్కొ న్నారు. గోదాముల్లో ధాన్యం నిల్వ చేసే సమయంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, రవాణా విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# ప్రధాని కార్యాలయం పర్యవేక్షణలో.. నీట్ రీటెస్ట్

నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దాంతో మే 3న జరిగిన ప్రవేశపరీక్ష రద్దు కావడంతో.. జూన్ 21 రీటెస్ట్ నిర్వహించేందుకు కేంద్ర విద్యాశాఖ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరోసారి ఎలాంటి లోపాలు తలెత్తకుండా కేంద్రం చర్యలు తీసుకుంటోంది. ఈసారి రీటెస్ట్ ప్రక్రియను ప్రధానమంత్రి కార్యాలయం నిశితంగా పరిశీలిస్తున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దిల్లీలోని తన నివాసంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీట్ రీటెస్ట్ ఎలాంటి అవకతవకలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. తాజాగా జరిగిన సమావేశంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా, ఎన్టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్, పీఎంఓ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పేపర్ తయారు చేయడం, ప్రింటింగ్, ట్రాన్స్‌పోర్టేషన్, పరీక్షా కేంద్రాలకు చేర్చడం వంటి ప్రతి ప్రక్రియను ప్రధాన మంత్రి కార్యాలయం (PMO) పర్యవేక్షించనుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ పరీక్షకు సంబంధించి ప్రతి అప్‌డేట్‌ను మోదీ తెలుసుకుంటున్నారని పేర్కొన్నాయి.

## వడదెబ్బతో వ్యక్తి మృతి



ప్రజాస్ఫూర్తి , జన్నారం : మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కవ్వాల గ్రామం కి చెందిన ఏల్పుల పోశం 57 అనే వ్యక్తి గురువారం వడదెబ్బతో మృతి చెందినట్లుగా కుటుంబ సభ్యులు తెలిపారు. గత కొన్ని రోజులుగా తీవ్ర ఎండల ప్రభావం వలన వడదెబ్బతో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య పెళ్లి అయిన కుమార్తె ఇద్దరు కుమారులు ఉన్నారు. పోషం మృతితో కవ్వాల్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## అకాల వర్షాలతో తడిసినా ధాన్యం కొంటాం

*** జిల్లా కలెక్టర్ అంకిత్**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:అకాల వర్షాలతో ధాన్యం తడిసినా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రత్యేక కార్యాచరణతో ధాన్యం సేకరణ ప్రక్రియ కొనసాగిస్తున్నామని ఒక ప్రకటనలో వెల్లడించారు.ధాన్యం రవాణాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా రవాణా, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. అన్ని రకాల వాహనాలను ధాన్యం రవాణాకు వినియోగిస్తున్నామని, ప్రతి రైస్ మిల్లుకు ప్రత్యేక ఇన్‌ఛార్జ్‌లను నియమించామని చెప్పారు. అదనపు హమాలీలను ఏర్పాటు చేసి అన్‌లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడింగ్‌లో జాప్యం జరిగితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. అకాల వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక అలర్ట్ వ్యవస్థను అమలు చేస్తున్నట్లు తెలిపారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని వెంటనే గుర్తించి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేలా ముందస్తు చర్యలు చేపట్టామని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ, సివిల్ సప్లై, రవాణా శాఖలు సమన్వయంతో ధాన్యం సేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.క్షేత్రస్థాయిలో ప్రత్యేక కోఆర్డినేటర్లు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ రైతులకు సహాయం అందించాలని సూచించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

## జన్నారంలో ఘనంగా బక్రీద్ వేడుకలు



ప్రజాస్ఫూర్తి ,జన్నారం : త్యాగం స్నేహం పవిత్రత దయా గుణానికి ప్రత్యేకంగా నిలిచిన బక్రీద్ పండగను జన్నారం మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో గురువారం ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు.మండల కేంద్రంలోని పొనకల్ గ్రామపంచాయతీ పరిధిలో ఈద్గా వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగణం చేసుకొని పండగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మానవాళిని జాగృతపరచి, మనలోని త్యాగనిరతిని చాటిచెప్పే పవిత్రమైన ఈ బక్రీద్ వేడుకను జరుపుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. సమాజంలో సామరస్యాన్ని పెంపొందించాలని, శాంతిని నెలకొల్పాలని ఆకాంక్షించారు.

## ఐటీ జాబ్ వదిలి వ్యవసాయం.. పిడుగు పడి మృతి



ఐటీ ఉద్యోగాన్ని వీడి.. ఓ టెకీ సాగుబాట పట్టాడు. ఇందులో భాగంగా పొలం చూసేందుకు వెళ్లగా.. అక్కడే పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన కర్ణాటకలోని మైసూరులో వెలుగుచూసింది. మడికెరి పట్టణానికి చెందిన రోషన్ బాలకృష్ణ (43) అనే ఐటీ ఉద్యోగి.. వ్యవసాయంపై ఆసక్తితో ఇటీవల తన ఉద్యోగాన్ని వదిలేశాడు. స్నేహితుడితో కలిసి సేద్యంలోకి అడుగుపెట్టాడు. ఆధునిక వ్యవసాయ పరికరాల మార్కెటింగ్ కూడా చేస్తున్నాడు. ఈ క్రమంలోనే సాగు ప్రణాళికల్లో భాగంగా కుటుంబ సభ్యులతో కలిసి మైసూరులో ఓ పొలం చూసేందుకు వెళ్లాడు. అక్కడే ఓ మామిడి చెట్టు వద్ద పండ్లు కోసేందుకు వెళ్లగా.. ఒక్కసారిగా పిడుగుపడింది. దీంతో అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మరొకరికి గాయాలయ్యాయి. మృతుడి కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.5 లక్షల పరిహారం ప్రకటించాయి.

# ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

**: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.**

*** జూన్ 4లోగా ధాన్యం, మొక్క జొన్న కొనుగోళ్లు పూర్తి చేయాలి.**




జనగామ, ప్రజాస్ఫూర్తి : ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను జూన్ 4వ తేదీ లోగా పూర్తి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలు,నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారు లను ఆదేశించారు. రైతులు పండించిన ప్రతిగింజను ప్రభుత్వం కొనుగోలు చే స్తుందని స్పష్టం చేశారు. గురువారం హనుమకొండ జిల్లా సమీకృత జిల్లా పరిపాలన అధికారి కార్యాలయంలోని ముఖ్య సమావేశ మందిరంలో రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధాన్యం కొనుగోళ్ల పై సమీ క్ష సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య , ఎమ్మెల్సీ బస్వారా జు సారయ్య , ఎమ్మెల్యేలు నాయిని రా జేందర్ రెడ్డి , రేవూరి ప్రకాష్ రెడ్డి , గండ్ర సత్యనారాయణ రావు, కడియం శ్రీహరి, కె.అర్ నాగరాజు , పాడి కౌశిక్ రెడ్డి తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.సమీక్ష సందర్భంగా పౌరసరఫ రాలుశాఖ మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో గన్నీ సంచుల కొరత లేదని, యాసంగి సీజన్‌కు అవస రమైన 24 కోట్ల సంచులు సిద్ధంగా ఉ న్నాయని తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జూన్ 3వ తేదీ లోగా ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు పూర్తి చేయాలని కలెక్టర్లకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట నే రైస్ మిల్లులకు తరలించాలని, రైతు లకు ఇబ్బందులు కలిగించే మిల్లర్ల పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తం గా 58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచిం చారు. రైతులు పండించిన ప్రతి గింజ ను కొనుగోలు చేసే బాధ్యత అధికారుల దేనని అన్నారు. జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లా లో ఇప్పటివరకు 1.55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి నట్లు తెలిపారు. 24 వేల మందికి పైగా రైతుల ఖాతాల్లో రూ.292 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదిక న కొనసాగిస్తున్నామని తెలిపారు. ఎ మ్మె ల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ఘనపూర్ నియోజకవర్గం లోని ఐదు మండలాల్లో ధాన్యం కొనుగోళ్లలో ఇంకా వేగం పెరగాలన్నారు. దాన్యాన్ని మిల్లు లకు త్వరగా తరలించాలాన్నారు.అకా ల వర్షాల నేపథ్యంలో రైతులు ఇబ్బం దులు పడకుండా ధాన్యం కొనుగోలు, రవాణా ప్రక్రియను వెంటనే వేగవంతం చేయాలని మంత్రిని కోరారు.

## బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

*** కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, సమాజంలో ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి ఉండాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం బక్రీద్ పండుగ సందర్భంగా లక్ష్మీదేవిపల్లి మండలంలోని బోడగుట్ట ఏరియాలో ఉన్న ఈద్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ముస్లిం సోదర కుటుంబాలను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు వాసిరెడ్డి మురళి, మైనార్టీ సంఘాల నాయకులు నయీమ్ ఖురేషి, అబిద్ హుస్సేన్, అబ్దుల్ రబ్, అన్వార్ పాషా, యాసీన్, ఎండి యూసుఫ్, ఖమర్, ఫారూఖ్, అమీర్ ఖాద్రి, ఇస్మాయిల్, షకీల్, ఇమ్రాన్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

*** చింతల చెరువును సందర్శించిన ఎమ్మెల్యే**

చింతల చెరువును ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చింతల చెరువును మరింత ఆధునీకరించి, అద్భుతంగా సుందరీకరిస్తామని తెలిపారు. చింతల చెరువు చుట్టూ రూ.1.50 కోట్లతో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు కృషి చేస్తున్నానని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే ప్రభుత్వానికి పంపి అనుమతులు మంజూరు చేయించామన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వాసిరెడ్డి మురళి, సర్పంచి శాంతి శ్రీ, భాగం నాగమణి, మాధవరావు, తాటి కృష్ణవేణి, ఏపూరి కృష్ణమూర్తి, కె రామారావు, కృష్ణ, నర్సింహారావు, సురేష్, గంగయ్య, భద్రం, ప్రసాద్, చౌదరి తదితరులు పాల్గొన్నారు.




## రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

*** రాష్ట్ర నీటి పారుదల ,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

భువనగిరి, ప్రజాస్ఫూర్తి : రైతులు పండించిన ధాన్యం ను రైతులకు ఇబ్బంది లేకుండా చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని రాష్ట్ర నీటి పారుదల ,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలుపై రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌర సరఫరా శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయడానికి ఈ పర్యటనలు సమావేశాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రభుత్వం రైతుల పక్షాన ఉంటుందని, ఎలాంటి పరిస్థితులు ఎదురైనా రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిస్తే రైతులు ఆందోళన చెందవద్దని, తడిసిన ధాన్యాన్నికూడా కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులకు నష్టం జరగనివ్వమని మంత్రి తెలిపారు. రెవెన్యూ, సివిల్ సప్లై, పోలీస్ శాఖలు పరస్పరం సమన్వయం చేసుకుంటూ ధాన్యం సేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతులు ఖాతాలో డబ్బులు జమ చేయడం జరుగుతుందని అన్నారు. నాలుగు, ఐదు రోజులు పాటు ఇసుక వాహనాలను పంట కొనుగోలు కోసం, అన్లోడింగ్ కోసం ఉపయోగించుకోవాలని తెలిపారు. రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈ సారి వరి ధాన్యం రికార్డు స్థాయిలో పండిందని రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయటం జరుగుతుందని ఎవరు ఆందోళన చెందవద్దని అన్నారు. గత ప్రభుత్వం రైతుల బాధలు పట్టించుకోకుండా నేడు మొసలి కన్నీరు కారుస్తూ రైతులను, ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తుందని దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుందని అన్నారు. మద్దతు ధర ప్రకటించిన ప్రకారం రైతులు పండించిన ధాన్యాన్ని సేకరిస్తూ అత్యధిక మొత్తంలో డబ్బులు జమ చేయడం జరిగిందని అన్నారు.ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఈసారి వరి ధాన్యం ఎక్కువ దిగుబడి వచ్చిందని, రైతుల పక్షాన ప్రభుత్వం ఉందని, రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు.జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 2,75,686.220 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగింది. జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా సివిల్ సప్లై మేనేజర్ హరికృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి రోజా రాణి, జిల్లా వ్యవసాయ అధికారి రమణారెడ్డి, మండల తహసిల్దార్లు, ఏఈఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మంత్రులు



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : యాదాద్రి జిల్లాలోని వంగపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, వేముల వీరేశం, మందుల సామేలు, రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రంలోని రైతులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రైతులు అధైర్య పడవద్దని ప్రతి గింజను కొనుగోలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, ఆర్డీవోలు కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, డిఆర్డిఓ నాగిరెడ్డి, జిల్లా సివిల్ సప్లై మేనేజర్ హరికృష్ణ, పౌరసరఫరాల అధికారి రోజా రాణి, జిల్లా వ్యవసాయ అధికారి రమణారెడ్డి పాల్గొన్నారు

## అర్హులైన ప్రతీఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : అర్హులైన ప్రతీఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుడికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేయించిన ఎల్ఓసీ పత్రాలను గురువారం చింతల్ లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన లబ్దిదారులకు బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా సిఎంసీ సూరారం డివిజన్ నెహ్రూ నగర్ కి చెందిన కొండవీటి అన్నమ్మ కు రూ.75,000, సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీకి చెందిన నూకారపు సూర్యనారాయణ కు రూ.1,50,000 మంజూరు కాగా ఆయా డివిజన్లకు చెందిన నాయకులు లబ్దిదారుల కుటుంబసభ్యులకు ఎల్వోసీ పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మంత్రి సత్య నారాయణ, సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సిద్దిక్, నాయకులు బలరాం రెడ్డి, గుబ్బల లక్ష్మీనారాయణ, ప్రభుదాస్, దుర్గారావు, వెంకట్ రెడ్డి, విజయ్ కుమార్, లక్ష్మణ్, రాజు, సత్యనారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## ఫ్యూచర్ సిటీ దేశానికే తలమానికం కానుంది

**: మంత్రులు పొంగులేటి, శ్రీధర్ బాబు**

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా రూపుదిద్దుకుంటోందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, శ్రీధర్ బాబు పేర్కొన్నారు. గురువారం ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయ భవనం, స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫ్యూచర్ సిటీని అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తోందన్నారు.

# మధుర పరిమళాల మనోహారం!

**ప్రకృతి ఒడిలో వికసించే పూలలో కొన్ని కేవలం అందాన్ని ఇస్తే, మరికొన్ని మధురమైన సుగంధాన్ని వెదజల్లుతాయి. కానీ, ఈ రెండింటినీ రంగరించుకున్న అద్భుతమైన తీగ మొక్క 'హనీసకల్'.**







హనీసకల్ అనగానే మనకు గుర్తొచ్చేది దాని విలక్షణమైన పూల ఆకారం. గొట్టం ఆకారంలో ఉండే ఈ పూలు గుత్తులు గుత్తులుగా పూస్తాయి. ఈ పూల అడుగు భాగంలో ఉండే మకరందం అత్యంత తీపిగా ఉండటం వల్ల దీనికి 'హనీసకల్' అనే పేరు వచ్చింది. పూలు... తెలుపు, పసుపు, ఎరుపు, పింక్ నారింజ రంగులలో విచ్చుకుంటాయి. ఈ పూల తీపి వాసన సీతాకోకచిలుకలను, తేనెటీగలను హమ్మింగ్ బర్డ్స్‌ను ఆకర్షిస్తుంది. సువాసనలు వెదజల్లే ఈ పూలలో కొన్ని రకాలు... సాయంత్రం వేళల్లో మరింత గాఢమైన సుగంధాన్ని విడుదల చేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 180 రకాల జాతుల్ని కలిగిన హనీసకల్ మొక్కది వేల ఏళ్ల చరిత్ర. ప్రాచీన చైనా వైద్య శాస్త్రంలో దీన్ని కీలకంగా వాడతారు. ముఖ్యంగా శరీరాన్ని చల్లబరచడానికీ, విష పదార్థాలను బయటకు పంపడానికీ ఉపయోగిస్తారట. బ్రిటన్‌లో విక్టోరియన్ కాలంలో ఈ పూలను ప్రేమకు, విశ్వాసానికి చిహ్నంగా, పెళ్లిలో వధువు ఈ పూలను పెట్టుకోవడం శుభసూచకంగానూ భావించేవారట. అందుకేనేమో... షేక్స్‌పియర్ వంటి ప్రముఖ కవుల రచనల్లో ఈ పూల ప్రస్తావన ఎక్కువగా కనిపిస్తుంది.

**తేమ అవసరమే కానీ...**

ఈ మొక్కకు రోజుకు కనీసం 6 నుంచి 8 గంటల పాటు ఎండ అవసరం. ఎండ తక్కువైతే పూలు తక్కువగా పూస్తాయి. నీరు నిల్వ ఉండని సారవంతమైన నేలలు దీనికి అనుకూలం. ఇవి తీగ జాతి మొక్కలు కాబట్టి, పాకడానికి గోడలు, ఫెన్సింగ్ లేదా ట్రెల్లీస్ వంటి ఆధారాల్ని కల్పించాలి. మొక్క నాటిన కొత్తలో క్రమం తప్పకుండా నీరు పెట్టాలి. ఎదిగిన తర్వాత నేల పైపొర ఆరిపోయినప్పుడు మాత్రమే నీరు పోయాలి. వేర్ల దగ్గర తేమ ఉండాలి కానీ నీరు నిలిచిపోకూడదు. శీతకాలం చివరలో లేదా వసంతకాలం మొదట్లో మొక్కను కత్తిరించాలి. ఎండిపోయిన కొమ్మలను తొలగించడం వల్ల కొత్త చిగుళ్లు వచ్చి పూలు ఎక్కువగా పూస్తాయి. ఏడాదికి రెండుసార్లు కంపోస్ట్ లేదా స్లోరిలీజింగ్ ఫెర్టిలైజర్లను అందించాలి. ఈ మొక్కకు పిండి నల్లి, తెల్లదోమ, బూజు తెగులు వంటివి వచ్చే అవకాశం ఉంది. వీటిని దూరం చేయడానికి ఫంగిసైడ్‌తో పాటు వేపనూనె పిచికారీ చేయవచ్చు. దానికంటే ముందుగా వ్యాధిసోకిన కొమ్మలు, ఆకులను కత్తిరించి దూరంగా పారేయడం మంచిది. ఈ జాగ్రత్తలతో మొక్క ఆరోగ్యంగా నిండుగా పూస్తుంది.





# చెమట పడితే మంచిదేనట!

**వేసవిలో వేడికి తట్టుకోలేక శరీరం చెమటలు పట్టడం సహజమే! అయితే ఇలా చెమటలు రావడం వల్ల చిరాగ్గా, అసౌకర్యంగా అనిపిస్తుంటుంది. దీంతో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లను ఆశ్రయిస్తుంటాం. నిజానికి శరీరం నుంచి చెమట బయటికి రాకుండా ఎప్పుడూ ఇలా చల్లటి వాతావరణంలో గడపడం కంటే.. కాస్త చెమట పట్టనివ్వడమే ఆరోగ్యకరం అంటున్నారు నిపుణులు. మరి, అదెలాగో తెలుసుకుందాం రండి..**



**వడదెబ్బ తగలకుండా..!**

ఎండాకాలంలో కాసేపు బయట గడిపినా, అధిక ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల వడదెబ్బ తగులుతుంటుంది. అయితే చెమటలు పట్టడం వల్ల వడదెబ్బ నుంచి కొంతవరకు రక్షణ పొందచ్చంటున్నారు నిపుణులు. అదెలాగంటే.. చెమట మన శరీరానికి సహజసిద్ధమైన కూలింగ్ ఏజెంట్‌లా పనిచేస్తుంది. ఎండ వేడి శరీరంలోకి వెళ్లకుండా చెమట అడ్డుపడుతుంది. తద్వారా శరీరంలో ఉష్ణోగ్రతలు పెరగకుండా జాగ్రత్తపడచ్చు. ఇక ఈ కాలంలో వడదెబ్బ నుంచి రక్షణ పొందాలంటే.. ద్రవాహారం ఎక్కువగా తీసుకోవడం, శరీరానికి చలువ చేసే పదార్థాల్ని తీసుకోవడమూ ముఖ్యమే అంటున్నారు నిపుణులు.

**రోగనిరోధక శక్తికి!**

స్వేద గ్రంథులు విడుదల చేసే చెమట రోగనిరోధక శక్తినీ పెంచుతుందని ఓ అధ్యయనంలో తేలింది. ఇందుకు స్వేద గ్రంథుల్లో ఉండే యాంటీమైక్రోబియల్ పెప్టైడ్లే కారణమట! ఇవి వ్యాధులకు కారణమయ్యే క్రిములతో పోరాడి.. సహజ రక్షణ కల్పిస్తాయి అంటున్నారు నిపుణులు.

**ఇవి కూడా!**

* వ్యాయామం చేసే క్రమంలో చెమట పడుతుంది. తద్వారా శరీరం చల్లబడడంతో పాటు ఎండార్ఫిన్లూ విడుదలవుతాయి. ఫలితంగా శారీరక నొప్పులు, ఒత్తిళ్లు తగ్గి ప్రశాంతంగా ఉండచ్చు అంటున్నారు నిపుణులు.
* శరీరం చెమట పట్టినప్పుడు చర్మ గ్రంథులు తెరుచుకుంటాయి. తద్వారా చర్మ రంధ్రాల్లో గాలి బాగా ఆడుతుంది. అలాగే శరీరంలోని మలినాలూ చెమట రూపంలో బయటికి వచ్చేస్తాయి. వీటివల్ల చర్మం ఎప్పటికప్పుడు శుభ్రపడుతుందట.

గమనిక : అయితే ఇలా చెమట పట్టడం మంచిదే అయినా.. ఎక్కువసేపు ఇలాగే ఉండడం వల్ల చర్మ ఆరోగ్యం దెబ్బతింటుంది. వాతావరణంలోని దుమ్ముధూళి చెమటతో కలిసి చర్మ రంధ్రాల్లోకి చేరడం వల్ల మొటిమలు, మచ్చలు ఏర్పడతాయి. కాబట్టి చెమట పట్టిన వెంటనే స్నానం చేయడం మంచిదంటున్నారు నిపుణులు.

# వేసవి తాపాన్ని తగ్గించే జల్ జీరా!

ఎండా కాలం వచ్చిందంటే చాలు దాహంతో అల్లాడిపోతుంటాం. ఈ సమయంలో కృత్రిమమైన కూల్ డ్రింక్స్, సోడాలను తాగే బదులు ఓ గ్లాస్ జల్ జీరా తాగి చూడండి. ఇది దాహం తీర్చడమే కాదు... మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలనూ అందిస్తుంది. ముఖ్యంగా ఇందులోని జీలకర్ర జీర్ణ రసాల ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుంది. దీన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే శరీరానికి అవసరమైన ఇనుమూ అందుతుంది. పీరియడ్స్ సమయంలో వచ్చే పొత్తికడుపు నొప్పి, తిమ్మిర్ల నుంచి ఈ పానీయం ఉపశమనం కలిగిస్తుంది. ఇక, ఇందులోని నల్ల ఉప్పు... శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లను అందిస్తుంది. అందుకే, ఎండలో తిరిగి ఇంటికి రాగానే ఒక గ్లాసు జల్ జీరా తాగి చూడండి. ఆ అలసట తక్షణమే మాయమవుతుంది. వేయించిన జీలకర్ర, కొద్దిగా అల్లం ముక్క, పుదీనా ఆకులు, పచ్చిమిర్చి (అవసరమైతే) కలిపి మెత్తగా రుబ్బాలి. ఈ మిశ్రమాన్ని చల్లని నీటిలో కలిపి, తగినంత నల్ల ఉప్పు, ఆమ్‌చూర్ పొడి, నిమ్మరసం కలపాలి. చివరగా కొద్దిగా బూందీ చల్లుకుంటే సరి. రుచికరమైన జల్ జీరా తయారైనట్లే. సహజ సిద్ధమైన ఈ పానీయం పెయిన్‌కిల్లర్‌లానూ పనిచేస్తుంది. జీవక్రియను మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా తక్కువ కెలోరీలు ఉండి, ఆకలిని నియంత్రించడంలో సహాయపడటం వల్ల బరువు తగ్గాలనుకునే మహిళలకు మంచి ఎంపిక.





# ఇలా... ప్రకృతికి చేరువగా!

**అపార్ట్‌మెంట్లలో ప్రతి చదరపు అడుగూ విలువైనదే. ఆయా గదుల్ని వినియోగం పరంగా ప్రత్యేకంగా మార్పులు చేసుకోలేం కానీ, బాల్కనీ అందుకు మినహాయింపు. అందుకే దీన్ని ఎలా తీర్చిదిద్దుతున్నామనేది ముఖ్యం. ప్రకృతికీ, పచ్చదనానికీ చేరువయ్యేందుకు ఇదో దగ్గర మార్గం. అందుకోసం ఏం చేయాలంటే...**

కాసేపు ఎండ పట్టడం, తీరిగ్గా కూర్చొని కప్పు కాఫీ తాగడం, ధ్యానం చేసుకోవడం... అన్నింటికీ ఒకటే చోటు... బాల్కనీ. చూశారా ఇది ఎంత ముఖ్యమైందో! అందుకే దీన్ని చిన్నపాటి పార్కుగా మార్చేయాలి. అప్పుడే ప్రకృతిలోకి వెళ్లాలనుకున్నప్పుడల్లా అక్కడ కాసేపు కూర్చొని సేదతీరొచ్చు.


* నిలువుగా పెరిగే మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వండి. అవి పాకేందుకు వీలుగా ఏర్పాట్లుచేయాలి. ఇవి గాలిని శుద్ధి చేస్తాయి. అలాగే ఎండ నుంచి ఉపశమనం కలిగిస్తాయి.
* తరచూ మార్చాల్సిన పనిలేకుండా ఎండలూ, వర్షాలకు తట్టుకునే మెటీరియల్‌ని అక్కడ ఉపయోగించాలి. అందుకు గట్టి కుండీలు, మెటల్‌తో చేసిన వస్తువులు ఎంచుకోవడం మేలు.
* ఇన్విజబుల్ నెట్టింగ్ బార్‌ని ఉపయోగించి పావురాలను దూరం పెట్టండి. అక్కడ కూర్చునేందుకు ప్రత్యేకంగా చిన్న సైజు కుర్చీల్ని వినియోగించండి.
* చీకటిపడ్డాక పెద్ద లైట్లు కాకుండా చిన్న సోలార్ లాంతర్లు వాడండి. వాటిని మొక్కల మధ్యన ఉంచితే ఇంకా మంచిది.

సినిమా

## సూర్య ఈ సారి ఏం చేస్తాడో చూడాలి మరి!



సూర్య తన కెరియర్ మొదలుపెట్టిన దగ్గర నుంచి ఎక్కడా పెద్దగా గ్యాప్ ఇవ్వకుండా వరుస సినిమాలు చేస్తూ వెళుతున్నాడు. అయితే ఆయనకి సరైన హిట్ పడి చాలా కాలమే అయింది. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'వీరభద్రుడు' (కరుప్పు) కూడా తెలుగులో ఆశించిన స్థాయిలో ఆడలేదు. తమిళనాడులో మాత్రం బాగానే ఆడిందనే వార్తలు వినిపించాయి. ఈ నేపథ్యంలో ఆయన తాజా చిత్రం నుంచి ఒక అప్ డేట్ వచ్చింది. తనకి తెలుగు దర్శకులతో కలిసి పనిచేయాలని ఉందనీ, నేరుగా తెలుగు సినిమా చేయాలని ఉందని సూర్య ఎప్పటి నుంచో చెబుతూ వస్తున్నాడు. ఇన్నాళ్లకి ఆయన కల నిజమైందని చెప్పచ్చు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఆయన ఒక సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ సినిమా పేరే 'విశ్వనాథ్ అండ్ సన్స్'. రీసెంటుగా ఈ సినిమా నుంచి వదిలిన టీజర్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. అలాంటి ఈ సినిమాను ఆగస్టు 14వ తేదీన విడుదల చేయనున్నట్టుగా ప్రకటించారు. ఒక 40 ఏళ్ల యువకుడికీ .. 20 ఏళ్ల యువతికి మధ్య నడిచే ప్రేమకథ ఈ సినిమాలో ప్రధానమైనదిగా ప్రేక్షకులను అలరిస్తుందని చెబుతున్నారు. మామితా బైజు కథానాయికగా నటించిన ఈ సినిమాలో, రాధికా శరత్ కుమార్ .. రవీనా టాండన్ కీలకమైన పాత్రలను పోషించారు. సితార బ్యానర్ పై నిర్మితమవుతున్న ఈ సినిమాను, తెలుగు .. తమిళ భాషల్లో విడుదల చేయనున్నారు. చాలాకాలంగా సూర్య వెయిట్ చేస్తున్న భారీ హిట్, ఈ సినిమాతోనైనా పడుతుందేమో చూడాలి.



## గ్లామరస్ బ్యూటీగా భాగ్యశ్రీ

భాగ్యశ్రీ బోర్సే .. పాల సరస్సులో పూసిన తెల్లకలువలాంటి అందం. అమరశిల్పి జక్కన ఊహకి కూడా అందని శిల్పం. మబ్బులను .. మెరుపులను కలిపి చేసినట్టుగా కనిపించే రూపం. చోళులు .. చాళుక్యుల కాలం నాటి శిల్పాల వరుసలో తప్ప, ఈ మధ్య కాలంలో ఎవరూ ఎక్కడా చూడని ఒక లావణ్య విశేషం. విశాలమైన కళ్లతో విన్యాసాలు చేస్తూ ఆమె యూత్ హృదయాలను కొల్లగొట్టేస్తోంది. అలాంటి భాగ్యశ్రీ బోర్సే గురించి మాట్లాడుకోని కుర్రాళ్లు ఉండరనే చెప్పాలి. తెరపై భాగ్యశ్రీని చూసిన కుర్రాళ్లంతా ఈ అమ్మాయికి నటన తెలియక పోయినా ఫరవాలేదు. అలా తెరపై కనిపిస్తూ ఉంటే చాలానే అనుకుంటారు. అందువల్లనే పెద్దగా సక్సెస్ లు లేకపోయినా, అవకాశాలు మాత్రం వెతుక్కుంటూనే వస్తున్నాయి. వచ్చే నెల చివరి వారంలో ఈ సుందరి 'లెనిన్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. అఖిల్ జోడీగా ఆమె చేసిన ఈ సినిమా, భారీ విజయాన్ని అందుకోవడం ఖాయమనే ఒక టాక్ బలంగానే వినిపిస్తోంది. అయితే ఇక్కడ మరో విశేషం ఏమిటంటే, 'పెద్ది' సినిమాలో భాగ్యశ్రీ కూడా మెరిసి ఉంటే బాగుండేదనే ఒక టాక్ ఇప్పుడు షికారు చేస్తోంది. 'పెద్ది'లో జాన్వీకపూర్ కథానాయికగా నటించగా, ఐటమ్ సాంగ్ లో శృతిహాసన్ సందడి చేయనుంది. మార్కెటింగ్ పరంగా చూసుకుంటే, మేకర్స్ నిర్ణయం సరైనదే అయినా, గ్లామర్ పరంగా చూసుకుంటే, భాగ్యశ్రీ కూడా ఎక్కడో ఒక చోట మెరిసే ఛాన్స్ ఇచ్చి ఉంటే బాగుండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చరణ్ తరువాత సినిమాలోనైనా ఈ బ్యూటీకి ఛాన్స్ దొరుకుతుందేమో చూడాలి మరి.






## 'పెద్ది' గురించి అడిగి.. మోదీ స్ఫూర్తి నింపే స్టోరీ చెప్పారు

**: రామ్‌చరణ్**

రామ్‌చరణ్ 'పెద్ది' జూన్ 4న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఇప్పటికే భోపాల్, బెంగళూరులో ప్రమోషన్స్ చేసిన చిత్ర బృందం.. గురువారం దిల్లీలో సందడి చేసింది. అక్కడ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రామ్‌చరణ్ , జాన్వీకపూర్ , దివ్యేందు శర్మ, బొమన్ ఇరానీ తదితరులు పాల్గొన్నారు. రామ్‌చరణ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీతో గతంలో జరిగిన భేటీని గుర్తుచేసుకున్నారు. ''దిల్లీలో ప్రధాని మోదీని ఇంతకుముందు కలిసినప్పుడు.. 'పెద్ది' సినిమా దేని గురించి అని అడిగారు. ఓ విధంగా వికసిత్ భారత్ గురించి చెప్పే కథ అని వివరించా. అప్పుడు ఆయన నాతో ఓ స్ఫూర్తినింపే స్టోరీని పంచుకున్నారు. 'పశ్చిమ బెంగాల్‌లోని ఓ గ్రామంలో మహ్మద్ అనే ఫుట్‌బాల్ క్రీడాకారుడు ఉండేవాడు. కొన్నేళ్ల క్రితమే భారత్ తరపున ఆడాడు. తన ఊరికి గుర్తింపు తీసుకొచ్చాడు. ఆ గ్రామం నుంచి ఇప్పుడు 85 మంది ప్లేయర్స్ ఉన్నారు' అని చెప్పారు. ఒక వ్యక్తి ఎంతో మార్పు తీసుకురాగలడు అన్నదానికి ఇదొక నిదర్శనం. పెద్ది పాత్ర కూడా అలాంటిదే'' అని చరణ్ వివరించారు. సినిమాలో ఇంత బాగా డ్యాన్స్ ఎలా చేశారు? అని అడగ్గా.. నిర్మాత మంచి పారితోషికం ఇచ్చారంటూ చరణ్ నవ్వులు పూయించారు. జాన్వీ మాట్లాడుతూ.. ''తెరపై కనిపించే రామ్‌చరణ్‌కు, తెరవెనుక చరణ్‌కు అస్సలు పోలిక ఉండదు. బయట చాలా కూల్‌గా ఉంటారు. బొమన్ ఇరానీతో కలిసి నటించాలన్న డ్రీమ్ ఈ సినిమాతో నెరవేరింది. నా పాత్ర విషయంలో దర్శకుడు బుచ్చిబాబు చెప్పిందే నేను ఫాలో అయ్యా. మేమంతా ఆయన ఫ్యాన్స్'' అని పేర్కొన్నారు.



**ట్రయాంగిల్ లవ్‌స్టోరీ: దివ్యేందు శర్మ**

'పెద్ది' కేవలం స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ మూవీ మాత్రమే కాదు.. ఇందులో ట్రయాంగిల్ లవ్‌స్టోరీ ఉందంటూ దివ్యేందు శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రామ్‌చరణ్, జాన్వీలది ఓ ప్రేమకథ అయితే.. తనకు, చరణ్‌కు మధ్య మరో లవ్‌స్టోరీ ఉందని, అది చాలా టాక్సిక్ అంటూ వ్యాఖ్యానించారు.

## ఈ ప్రయాణంలో మీకు మీరే స్నేహితులు

కళా రంగమే కాదు.. మీరు ఎంచుకున్న ఏ ప్రపంచంలోనైనా మీ ప్రయాణం వ్యక్తిగతమైనదే అంటోంది కథానాయిక ఐశ్వర్య రాయ్. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె చిత్రపరిశ్రమలో రాణించాలనుకున్నప్పుడు వ్యక్తిత్వానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యత గురించి తన అభిప్రాయాన్ని పంచుకుంది. ''నటిగా ఇప్పటికీ ప్రతిరోజు కొత్తగానే భావిస్తాను. సృజనాత్మకతతో కూడిన ఈ ప్రపంచంలో మనల్ని మనం వెతుక్కునే నిరంతర ప్రయాణం ఇది. అలాంటిది ఎవరికో సలహాలు ఇచ్చేంత గొప్ప స్థానంలో నేను ఉన్నానని అనుకోను. ప్రేక్షకులు నాపై చూపే ప్రేమ, ఆదరాభిమానాలకు ఎల్లప్పుడూ కృతజ్ఞురాలినే. కానీ, కళా రంగమే కాదు.. ఎంచుకున్న ఏ ప్రపంచంలోనైనా మీ ప్రయాణం వ్యక్తిగతమైనది. మీ అనుభవాలే మీకు జీవితంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోగలరో తెలుసుకునేందుకు సహాయపడతాయి. ఎందుకంటే ఒక్కొక్కరిది ఒక్కో రకమైన దృష్టికోణం. నేను చెప్పాలని అనుకున్నదల్లా ఒక్కటే.. ఇప్పుడున్న పరిస్థితుల్లో మీ చుట్టూ ఏం జరుగుతుందో మీరు ఊహించలేరు. ప్రతి విషయాన్ని ఒక ప్రణాళికతో కృత్రిమంగా చేయడానికే ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు. నిజమో కాదో తెలుసుకునేలోపే అంతా జరిగిపోతుంది. యువతరం ఇలాంటి వాటిని చూసి పక్కదారి పట్టకూడదు. బయటకు వెళ్లండి. మీ అభిరుచిని తెలుసుకోండి. మీ నిర్ణయాలతో నిజాయతీగా మెలగండి. ఆ ప్రయాణంలో మీకు మీరే మంచి స్నేహితులుగా నిలబడాలి అని చెప్పింది



## ప్రభా సంచలనం యుధ్ వీర్ అహ్లావత్ ఎవరు?



చిత్ర పరిశ్రమలో ఎప్పుడు ఎవరు స్టార్‌డమ్ అందుకుంటారో చెప్పడం కష్టం. ఒక్క సినిమాతో రాత్రికి రాత్రే అగ్రస్థానానికి చేరిన వాళ్ళు ఎందరో ఉన్నారు. తాజాగా ఈ జాబితాలో చేరాడు యువ నటుడు యుధ్ వీర్ అహ్లావత్. షారుఖ్ ఖాన్, ఐశ్వర్య రాయ్, దళపతి విజయ్, జూనియర్ ఎన్టీఆర్ వంటి అగ్ర తారలను వెనక్కి నెట్టి ఐఎండీబీ ఇండియా విడుదల చేసిన మోస్ట్ పాపులర్ ఇండియన్ సెలబ్రిటీల వీక్లీ జాబితాలో నెం.1 స్థానాన్ని కైవసం చేసుకుని సంచలనం సృష్టించాడు. ఈ ఘనత సాధించడానికి ముఖ్య కారణం, మే 15న నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన క్రైమ్ థ్రిల్లర్ 'కర్తవ్య'. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 250 మిలియన్లకు పైగా ఐఎండీబీ యూజర్లు సందర్శించే సెలబ్రిటీల ప్రొఫైల్ పేజీల ఆధారంగా ఈ ర్యాంకింగ్ నిర్ణయిస్తారు. పుల్కిత్ దర్శకత్వం వహించి, రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించిన 'కర్తవ్య' చిత్రంలో యుధ్ వీర్ నటనకు విమర్శకులతో పాటు ప్రేక్షకుల నుంచి విశేష ప్రశంసలు వెల్లువెత్తాయి. ఈ సినిమాలో, పరిస్థితుల ప్రభావంతో కాంట్రాక్ట్ కిల్లర్‌గా మారే 'హర్పాల్' అనే టీనేజర్ పాత్రలో యుధ్ వీర్ జీవించాడు. అతని సహజ నటన, భావోద్వేగాలను పండించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. ఈ సినిమా విజయంతో యుధ్ వీర్ ఐఎండీబీ ప్రొఫైల్‌ను వెతికే వారి సంఖ్య భారీగా పెరిగి, అతడిని అగ్రస్థానంలో నిలబెట్టింది. సైఫ్ అలీ ఖాన్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రంలో యుధ్ వీర్ సహాయ నటుడిగా కనిపించినప్పటికీ, తన నటనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. హర్యానాకు చెందిన యుధ్ వీర్, 2019లో వచ్చిన 'సాండ్ కీ ఆంఖ్' చిత్రంతో నటనలోకి అడుగుపెట్టాడు. ఆ తర్వాత 'లవ్ హాస్టల్', 'కో ఎడ్' వంటి వెబ్ సిరీస్‌లలో కూడా నటించాడు. తెరపై చిన్న వయసు పాత్రల్లో కనిపిస్తున్నప్పటికీ, తను మైనర్ కాదని గతంలోనే పలు ఇంటర్వ్యూలలో స్పష్టం చేశాడు. తాజా ఐఎండీబీ జాబితాలో కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొనడంతో ఐశ్వర్య రాయ్ 3వ స్థానంలో, తమిళనాడు ముఖ్యమంత్రిగా రాజకీయ వార్తలతో విజయ్ 4వ స్థానంలో నిలిచారు. జూనియర్ ఎన్టీఆర్ 24వ స్థానంలో ఉండగా, షారుఖ్ ఖాన్ టాప్ 30లో కూడా లేకపోవడం గమనార్హం. యుధ్ వీర్ విజయంపై సోషల్ మీడియాలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఐఎండీబీ ఇండియా ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌పై స్పందించిన నెటిజన్లు, అతని ప్రతిభను కొనియాడుతున్నారు. ఒక వినియోగదారుడు 'జఖ్మ్', 'మాసూమ్' వంటి చిత్రాల్లోని బాలనటుల ప్రదర్శనతో యుధ్ వీర్ నటనను పోల్చడం విశేషం. మొత్తం మీద, 'కర్తవ్య' సినిమాలోని బలమైన పాత్ర, దానిని యుధ్ వీర్ అద్భుతంగా పోషించడం వల్లే ఈ అనూహ్యమైన పాపులారిటీ సాధ్యమైందని స్పష్టమవుతోంది. ఈ చిత్రంలో రసికా దుగ్గల్, సంజయ్ మిశ్రా, జాకీర్ హుస్సేన్ వంటి ప్రముఖ నటులు కూడా ఉన్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.